



జైశ్రీరామ్..!! నెల్లూరు : రాజరాజేశ్వరి ఆలయంలో దీపోత్సవం

జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ !.. రామనామ స్మరణతో జిల్లా పులకింత

పల్లె నుంచి పట్టణం దాకా... పేద నుంచి పెద్ద వరకు... గడప గడపనా, వీధి వీధినా, ఊరూవాడా ఒకటే స్మరణ అదే 'జై శ్రీరామ్'. అయోధ్యలోని భవ్య రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో జిల్లా అంతటా రామ నామం మారుమోగింది. ప్రతిష్ఠా క్రతువును టీవీలు, ఫోన్లలో ప్రత్యక్షంగా వీక్షించిన ప్రజలు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. చిరునవ్వులు చిందిస్తున్న చిన్ని రామయ్య రూపును దర్శించి తన్మయత్వంతో పులకించిపోయారు. సాయంత్రం దీపాలు వెలిగించి రఘునాథుడిపై ఉన్న అచంచల విశ్వాసాన్ని, భక్తిప్రపత్తులను చాటుకున్నారు.



ఉలవపాడు : వేణుగోపాలుడి ఆలయ ప్రాంగణంలో ఎల్ఈడీ స్ర్కీన్‌లో అయోధ్య సన్నివేశాలను తిలకిస్తున్న భక్తులు

పలువురు సీఐ, ఎస్ఐల బదిలీ

నెల్లూరు (క్రైం) : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు రేంజ్ పరిధిలోని 23 మంది సీఐలను, జిల్లాలోని 17 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్ సీఐ షైమారావును బుచ్చిరెడ్డిపాలెం అర్బన్‌కు, పాత గుంటూరు అర్బన్ సీఐ మొగిళ్లి వెంకట సుబ్బారావును బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న బీవీవీ. సుబ్బారావును గుడ్లూరు సర్కిల్‌కు, ఎస్సీ, ఎస్టీ సెల్ (ప్రకాశం)లో ఉన్న కె అజయ్‌కుమార్‌ను నెల్లూరు దిశ-2 ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. అలాగే, జిల్లాలో విధులు నిర్వహిస్తూ స్థానికత కలిగి ర్యాంకర్లు అయిన 17 మంది ఎస్ఐలను ఇతర జిల్లాలకు బదిలీ చేసినట్లు ఐజీ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. అలాగే ఇతర జిల్లాల నుంచి 17 మంది ఎస్ఐలను జిల్లాకు కేటాయించారు.

జిల్లా ఓటర్లు 19,08,498

- మహిళలు 9,73,089, పురుషులు 9,35,195

నెల్లూరు (ఆంధ్రజ్యోతి): తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 19,08,498 మంది ఓటర్లు ఉన్నట్టు లెక్కతేల్చారు. విశేషమేమంటే అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్యే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 9,35,195 మంది కాగా, మహిళా ఓటర్లు 9,73,089 మంది ఉన్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ నారీమణులే అధికంగా ఉండటం విశేషం. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 2,67,750 మంది, కోవూరులో 2,61,182 మంది ఓటర్లతో ద్వితీయ స్థానంలో ఉంది. కందుకూరులో 2,26,765, కావలి 2,34,230, ఆత్మకూరు 2,12,939, కోవూరు 2,61,182, నెల్లూరు సిటీ 2,37,736, నెల్లూరు రూరల్ 2,67,750, సర్వేపల్లి 2,29,139, ఉదయగిరిలో 2,38,757 ఓటర్లు ఉన్నట్టు గుర్తించారు. కాగా, కలెక్టరేట్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ హరినారాయణన్ సమావేశమై తుది ఓటర్ల జాబితాను వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ట్రైనీ కలెక్టర్ సంజనాసంహ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన ఇసుక కొనుగోళ్లు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : రీచ్‌ల వద్ద రోడ్ల మరమ్మతుల పేరుతో అదనపు వసూలు చేయడంపై ట్రాన్స్‌పోర్టర్లు గళం విప్పారు. శనివారం ఇందుకూరుపేట మండలంలో రెండు రీచ్‌ల వద్ద ట్రాక్టర్, టిప్పర్ల యజమానులు ఆందోళన చేశారు. అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో అన్ని రీచ్‌లలో సోమవారం ఇసుక కొనుగోళ్లు ఆపేశారు.

4,624 మంది అంగన్‌వాడీలపై వేటు

- 2,408 మంది టీచర్లు, 2,218 మంది హెల్పర్లు విధుల నుంచి తొలగింపు

నెల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా చరిత్రలో కనీవినీ ఎరుగని అత్యంత బాధాకరమైన ఘటన చోటు చేసుకుంది. డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగిన అంగన్‌వాడీల బతుకులను ప్రభుత్వం ఒక్క కలం పోటుతో అతలాకుతలం చేసింది. 4,600 మంది అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లను ఒక్కసారిగా విధుల నుంచి శాశ్వతంగా తొలగించింది. తమ డిమాండ్ల సాధన కోసం 42 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. వీరిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోగా సమ్మెను నీరుగార్చే ప్రయత్నాలను చేసింది. ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. ఎందుకు ఉద్యోగాల నుంచి తొలగించకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు ఇచ్చింది. అయినా అంగన్‌వాడీలు వెనక్కు తగ్గలేదు. ఈ రోజు కాకపోతే రేపైనా ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశతో దీక్షలు కొనసాగించారు. అయితే ఎవరి ఊహకు అందని విధంగా సమ్మెలో ఉన్న అంగన్వాడీలందరినీ ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు శిశు సంక్షేమ శాఖ అధికారులు సోమవారం రాత్రి సమ్మెలో ఉన్న 4వేల పైచిలుకు అంగన్‌వాడీలను శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించారు. జిల్లాలోని 2408 మంది అంగన్‌వాడీ టీచర్లను, 2218 మంది హెల్పర్లను (మొత్తం 4,624 మంది) శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్లు మాతా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హేనసుజన్ తెలిపారు. మరోవైపు అంగన్‌వాడీ, ప్రజాసంఘాల నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నెల్లూరులో అంగన్వాడీలు ప్రదర్శన నిర్వహించారు.



కందుకూరు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు


నెల్లూరు : శోభా యాత్రకు ముందు డప్పు వాయిద్యం

జై శ్రీరామ్!

● అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠతో ఆనందోత్సాహాలు

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, వేడుకలు నిర్వహించారు. ధార్మిక సంఘాలు, భక్తిమండళ్ల ఆధ్వర్యంలో భజనలు, కోలాటాలు, బాణాసంచా వేడుకలతో సంబరాలు చేశారు. విడవలూరు మండలం రామతీర్థంలో విశేష అలంకారంలో సీతారామలక్ష్మణ సహిత హనుమంత స్వామికి పూజలు చేశారు. ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు తిలకించారు. బుచ్చిరెడ్డిపాళెంలోనూ విశేషంగా కార్యక్రమాలు జరిగాయి. పట్టపుపాళెంలోని శ్రీరామ మందిరాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణమూర్తులకు ఊంజల్ సేవ, విశేష పూజలు జరిగాయి. శబరి శ్రీరామక్షేత్రం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంతోపాటు పలు దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు, గోపూజలు జరిగాయి. నగరంలోని శివాజీసెంటర్‌లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో పూజలు, భజనలు చేశారు. భక్తులు వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి పోరాటం చేసిన నాయకులు, వీరమరణం పొందిన కరసేవకుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకుని వారికి నివాళులు అర్పించారు. ఇళ్లలోనూ శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేశారు. అన్న ప్రసాదాలు పంచారు. సాయంత్రం ఇంటింటా దీపాలు వెలిగించి తమ భక్తిని చాటారు.

- నెల్లూరు (సాంస్కృతికం)


అల్లూరు : నార్తుమోపూరులో చప్పరంపై ఉత్సవర్ల ఊరేగింపు


పొదలకూరులో రామభక్తుల శోభాయాత్ర


విడవలూరు : రామతీర్థంలో సీతారాముల కల్యాణం


నెల్లూరులో రాములోరి ఊరేగింపు


కావలి : సీతారామ,లక్ష్మణుల వేషధారణలో భక్తుల ర్యాలీ


నెల్లూరులో నృత్య కళాకారిణి ప్రదర్శన


బిట్రగుంట : 300 మందితో బైక్ ర్యాలీ


పరికుంటపాడులో రామభక్తుల ప్రదర్శన


నెల్లూరులో అన్నదానం

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైం), జనవరి 22: నెల్లూరు ప్రధాన, సౌత్ రైల్వే స్టేషన్‌ల మధ్య ఎస్-2 సినిమాహాలు సమీపంలో సోమవారం శబరి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ మాలకొండయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, అదే కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాలకొండయ్య తెలిపారు.

నకిలీ సీబీసీఐడీ అధికారి అరెస్ట్


నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ వీరానాయక్

నెల్లూరు(క్రైం), జనవరి 22 : సీబీసీఐడీ అధికారినంటూ కత్తులతో బెదిరించి నగదు దోచుకెళ్లిన వ్యక్తితోపాటు మరొకరిని బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లోనిందితుల వివరాలను సీఐ వీరా నాయక్ వెల్లడించారు. నగరానికి చెందిన ప్రసాద్‌కు హైదరాబాద్‌లోని నాగోల్‌కు చెందిన సుబ్బారావు బంధువు. వీరు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రమేష్‌తో కలిసి నకిలీ గుర్తింపు కార్డులతో కర్ణాటకలోని బళ్లారిలో అనుమతుల్లేని ఓ కంపెనీ ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బళ్లారిలో కేసు నమోదు చేయగా సీబీసీఐడీ అధికారులు సుబ్బారావు, రమేష్‌ను అరెస్ట్ చేశారు. ప్రసాద్‌ను అరెస్టు చేయలేదు. దీంతో సుబ్బారావు ప్రొద్దుటూరు మండలంలో తన స్నేహితుడు మల్లికార్జునతో కలిసి ప్రసాద్‌ను బెదిరించి నగదు దోచేయాలని పథకం వేశాడు. ఈ క్రమంలో స్నేహితుడిని సీబీసీఐడీ అధికారిగా మార్చి ఈ నెల 17వ తేదీన శాఖమూరి సుబ్బారా వు, మల్లికార్జునలు ఏసీనగర్‌లో ఉంటున్న ప్రసాద్ భార్య సుమలత తల్లి ఇంటికి వచ్చారు. అక్కడే ఉన్న ప్రసాద్ దంపతులకు మల్లికార్జునను సీబీసీఐడీ అధికారిగా సుబ్బారావు పరిచయం చేశాడు. బళ్లారిలో నమోదయిన కేసులో అరెస్ట్ చేయకుండా ఉండాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని లేకుం టే పరువుతీస్తానని, జైలుకు పంపుతానని నకిలీ సీబీసీఐడీ అధికారి వారిని బెదిరించాడు. దీంతో వారు తమ వద్ద నగదు లేదని చెప్పడంతో నిందితులు ఇద్దరు చాకులతో బెదిరించి ప్రసాద్ వద్ద బంగారు ఉంగరం, రూ.25 వేలను దోచుకున్నారు. రెండు, మూడు రోజుల్లో వస్తామని రూ.5 లక్షలు ఇవ్వాల్సిందేనని బెదిరించి పరారయ్యారు. ఈ మేరకు బాధితులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఎస్పీ కే.తిరుమలేశ్వర రెడ్డి ఆదేశాలతో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈ నెల 21వ తేదీ సాయంత్రం నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఉంగరం, రూ.24 వేలను స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ వీరానాయక్, హెడ్‌కానిస్టేబుళ్లు కేవీ.సుధాకర్, సీహెచ్ శివకుమార్, కానిస్టేబుళ్లు ఏ.తిరుపతి, ఎం.హరి, పీ.పార్థసారథి, శివప్రసాద్‌లను ఎస్పీ అభినందించారు.

పోలీస్ స్టేషన్ ఎదుట మహిళల ఆందోళన

● సీఐతో బీజేపీ నేత, మహిళల వాగ్వాదం

వెంకటాచలం, జనవరి 22 : మండలంలోని నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన మహిళలు, బీజేపీ నాయకులు సోమవారం రాత్రి వెంకటాచలం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. మూడు రోజుల కిందట నిడిగుంటపాళెనికి చెందిన బీజేపీ సానుభూపతిపరులను పోలీసులు తీసుకొచ్చి నిర్బంధించి కొట్టారని వారు ఆరోపించారు. ఈసందర్భంగా మహిళలు వెంకటాచలం సీఐ అంకమరావుతో వాగ్వాదానికి దిగారు. దీంతో సీఐ తీరును బీజేపీ సానుభూపతిరులకు మద్దతుగా వచ్చిన బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ తప్పుబట్టారు. తమ వారిని వెంటనే విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. తాము ఎవరినీ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి కొట్టలేదని, ఏమైనా ఉంటే కోర్టులో చూసుకోవాలని, స్టేషన్ ఎదుట నిరసనలు, ఆందోళనలు చేస్తే కేసులు పెట్టాల్సి వస్తుందని సీఐ హెచ్చరించారు. దీంతో సీఐ తీరుపై మహిళలు అసహనం వ్యక్తం చేశారు. తాను మహిళలతో కలిసి శాంతియుతంగా వచ్చి అడిగితే సీఐ బెదిరించడం సరికాదని కుంచి శ్రీనివాసులు ఆరోపించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	103
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5949
వెండి కిలో ధర	రూ. 72,000
వెండి ఒక గ్రాము	రూ. 74.00

కామాక్షితాయి సేవలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి22: మండలంలోని జొన్నవాడ ఆలయంలో డిప్యూటీ సీఎం కే నారాయణ స్వామి సోమవారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం, ఈవో గిరికృష్ణ ఆయన్ను శాలువాలతో సత్కరించి, స్వామి,అమ్మవార్ల శేషవస్త్రాలను అందజేశారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యమివ్వండి

● కలెక్టర్ హరినారాయణన్


అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 22 : జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చిన అర్జీలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. పరిష్కారానికి నోచని అర్జీలకు సంబంధించిన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో లవన్న, ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హ, తదితరులు పాల్గొన్నారు.

● కులగణన కాలపరిమితిని కనీసం నెలరోజులకు పెంచాలని కోరుతూ బీసీ హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ బెల్లంకొండ చిన్నయ్య కలెక్టర్ హరినారాయణన్‌కు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనను ఉద్యోగులు, అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో కులగణనపై విస్తృత ప్రచారం చేయించాలన్నారు. ఈనెల 19న కులగణన ప్రారంభమైనా ఇప్పటి వరకు ప్రభుత్వం నియమించిన సిబ్బంది గృహాల వద్దకు రాలేదని ఆరోపించారు.

డిగ్రీలో స్పెషల్ ఫీజులు రద్దు చేయాలి

నెల్లూరు(విద్య) : డిగ్రీ కళాశాలల్లో పెంచిన స్పెషల్ ఫీజులు రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నేతలు కలెక్టరేట్ స్పందనలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, శ్రీహర్ష మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల్లో పెంచిన స్పెషల్ ఫీజులు రద్దు చేయడంతోపాటు ఓఎస్‌పీ యాప్ ద్వారా ఫీజు కట్టించుకోవడం నిషేధించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు న్యాయం జరగకపోగా విద్యా, వసతి దీవెనలకు చెల్లించాల్సిన పది వేల కోట్ల నిధుల బకాయిలు నిలిచిపోయాయన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు వసతి దీవెన ఇన్‌స్టాల్‌మెంట్ పెండింగ్‌లో ఉందన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఫీజు రెగ్యులేషన్ లేకపోవడంతో విద్యార్థులకు నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు మనోజ్, చరణ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

● అదనపు ఎస్పీ అడ్మిన్ సౌజన్య


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), జనవరి 22: గృహ హింస, అధిక కట్నం కోసం వేధింపులు, చెడు వ్యసనాలకు బానిసై మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారంటూ అందిన ఫిర్యాదులపై తక్షణం స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఏఎస్పీ అడ్మిన్ సీహెచ్ సౌజన్య అదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పోలీసు స్పందనకు 90 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులు స్వీకరించిన ఏఎస్పీ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, పొలాలపై, ఇళ్లు నిర్మించుకొనేందుకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి నగదు తీసుకునే వారిని నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రాల ద్వారా లక్షలు వసూలు చేస్తూ యువతను మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దొంగతనం కేసుల్లో సాంకేతిక ఆధారంగా నిందితుల ఆచూకీ కనుగొని చోరీ సొత్తు రికవరీకి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మరణాల కేసులలో ఎలాంటి అలసత్వం లేకుండా దర్యాప్తు వేగవంతం చేసి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు పాల్గొన్నారు.

దళితుల మీద జగన్మోహన్‌రెడ్డిది కపట ప్రేమ

● తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పనబాక

నెల్లూరు(వైద్యం), జనవరి 22 : దళితుల మీద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కపట ప్రేమ నటిస్తున్నారని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి విమర్శించారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మహానుభావుడు అనిపించుకుందామని జగన్ ప్రయత్నించినప్పటికీ దళిత సంఘాలు ఆయనను నమ్మే స్థితి లేదన్నారు. కోడికత్తి కేసులో పేద దళితుడైన శీనును వాడుకుని వదిలేశారన్నారు. పేదరికంలో ఉన్న వారి వృద్ధ తల్లిదండ్రులకు కన్నీటి ఘోష మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్క్ అడిగిన పాపానికి సుధాకర్ అనే వైద్యుడ్ని గుండు కొట్టి పిచ్చోణ్ణి చేసి అతని మృతికి కారణమయ్యారన్నారు. నాగమ్మ లాంటి మహిళను క్రూరంగా అత్యాచారం చేస్తే వేడుక చూస్తూ కూర్చున్న చరిత్ర జగన్‌దని ఆరోపించారు. దళితుడ్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి పదవులు కట్టబెట్టిన ఘనం ఆయనదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలుగు మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరి విజయమ్మ, జిల్లా మాజీ అధ్యక్షురాలు బీవీ లక్ష్మి, పద్మ, మంగమ్మ, శ్రీదేవి, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి 30లోగా ఫీజు చెల్లించాలి


నెల్లూరు(విద్య), జనవరి 22 : ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్‌లో కొత్తగా ప్రవేశం పొందేందుకు ఏఐ సెంటర్‌లలో ఈనెల 30వ తేదీ లోగా అడ్మిషన్ ఫీజు చెల్లించాలని డీఈఓ గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. స్పెల్-1లో రిజిస్టర్ అయ్యి అడ్మిషన్ ఫీజు చెల్లించని వారు పాత రిజిస్ట్రేషన్ నెంబర్‌తో అడ్మిషన్ ఫీజు చెల్లించి కొనసాగవచ్చని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు చెల్లించిన అభ్యాసకులు స్పెల్-1 అభ్యాసకులతో పాటు ఫిబ్రవరి 4 నుంచి 17వ తేదీ వరకు జరిగే పీసీసీ తరగతులకు హాజరు కావాలని తెలిపారు. వేసవి సెలవుల్లో మే 1 నుంచి జూన్ 6వ తేదీ వరకు పీసీసీ తరగతులకు హాజరైన వారిని జూన్, జూలై నెలలో జరిగే పరీక్షకు అనుమతిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

రేపటి నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు

● నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

నెల్లూరు(విద్య), జనవరి 22 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ-3) పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జిల్లా విద్యాశాఖ పూర్తి చేసింది. విద్యార్థి సామర్థ్యాలను అంచనా వేసే ఎఫ్ఏ-3 పరీక్షలు బుధవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించనున్నారు. గతంలో మాదిరిగానే 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలు నమోదు చేసేలా పరీక్షలు నిర్వహిస్తుండగా 9, 10 తరగతుల విద్యార్థులకు మాత్రం పాత పద్ధతి లోనే నిర్వహించనున్నారు. పరీక్షలు పూర్తయిన వెంటనే మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను ప్రభుత్వ పాఠశాలలు అయితే సంబంధిత ఎంఈఓలు, హెచ్ఎంలు, ప్రైవేట్ పాఠశాలలు అయితే ప్రత్యేక బృందాలు పరిశీలిస్తాయని డీఈఓ గంగాభవాని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పరీక్షలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

సాయుధ బలగాల రీ ఫ్రెష్ ట్రైనింగ్ ప్రారంభం

నెల్లూరు(క్రైం) : రాబోయే ఎన్నికల దృష్ట్యా శారీరకంగా దృఢంగా, మానసికంగా, చురుగ్గా ఉండి ఎటువంటి అవరోధాలనైనా సమర్థవంతంగా అధిగమించే విధంగా వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని సాయుధ బలగాలకు జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పోలీసు కవాతు మైదానంలో జిల్లా సాయుధ బలగాల సిబ్బంది వార్షిక సమీకరణ రీ ఫ్రెష్ ట్రైనింగ్‌ను సోమవారం ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు కీలక సేవలు అందించే సంక్లిష్ట విభాగమే జిల్లా సా యుధ దళం అన్నారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అం శాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఈ మొబలైజేషన్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అత్యాధునిక ఆయుధాల నిర్వహణ ఉపయోగంతో పాటు ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, మాబ్ కంట్రోల్, వీవీఐపీ ఎస్కార్ట్స్, పీఎస్‌వో, బందోబస్త్ ఇలా అన్ని విషయాలపై అవగాహన పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఏఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి


కందుకూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న రామభక్తులు


ఆత్మకూరు : రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న పట్టణ ప్రముఖులు

ఊరూవాడ రామనామ స్మరణ

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు ● పలుచోట్ల శోభాయాత్రలు

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలోని మండలాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శ్రీరామ భజనలు, సీతారాముల కల్యాణం, పల్లకీసేవ, శోభాయాత్రలు ఇళ్లపై కాషాయ జెండాల ఆవిష్కరణ, గృహాల్లో దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకున్నారు. పలుచోట్ల అన్నదానం చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు.

కందుకూరు, జనవరి 22: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయాల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని అంకమ్మ ఆలయం వద్ద రామభక్తుల ఆధ్వర్యంలో డాక్టరు తన్నీరు మల్లికార్జున అయోధ్య విశేషాలను ప్రజలు తిలకించేందుకు స్క్రీన్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వడపప్పు, పానకం, ప్రసాదాలను పంచిపెట్టారు. పెద్దబజారులో ఉన్న కోదండరామాలయంలో కోదండరాముడికి పుష్పయాగం నిర్వహించారు. పామూరురోడ్డులోని రామాలయంలోను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లింగసముద్రం: స్థానిక ఆర్యవైశ్యుల కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. కొండాపురం మండలం తూర్పుపాలెంకి చెందిన శివనాగక్షేత్రం ప్రతినిధులు శ్రీమన్నారాయణ, రాజేష్, మనోజ్, కృష్ణల ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు సీతారాముల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే లింగసముద్రం, కొండాపురం మండలాల్లోని పాఠశాలల విద్యార్థులకు స్వీట్లు, పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు దేవకి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : నార్తుమోపూరులో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. పల్లకీలో స్వామివారిని ప్రత్యేక అలంకరించి గ్రామంలో ఊరేగించారు. అదేవిధంగా మండలంలోని అన్ని గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలిగిరి : మండలంలోని 23 పంచాయతీల్లో అయోధ్య రాముడి అక్షితలు, ఆలయ చిత్రాన్ని పంపిణీ చేసినట్లు సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ కర్రా భాస్కర్ తెలిపారు. ఆలయాల వద్ద భక్తులు రామనామ స్మరణలతో పూజలు నిర్వహించారు. కోలాటాల, భజన బృందాలు రామనామం జపిస్తూ నృత్యాలు చేశారు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని బోగోలు, విశ్వనాథరావుపేట, రామస్వామిపాలెం, కొత్తూరు, చెంచులక్ష్మీపురం, నాగులవరం, చెన్నారెడ్డిపాలెం, సుందరగిరివారి కండ్రికలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ జరిగాయి, తాటిచెట్లపాలెంలో గ్రామకాపులు వాయిల నాగరాజు, ప్రళయకావేరి బాబు, ఆవుల మోహన్‌రావు, తిరుపాలు ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. 300 మంది బైక్‌లపై జువ్వలదిన్నె నుంచి ఇస్కపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. కొండబిట్రగుంటలో రాముని చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు.


చేజర్లలో సీతారాముల వేషధారణ

కొండాపురం : మండల పరిధిలోని అన్ని గ్రామాల రామాలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. అలాగే అయోధ్య నుంచి వచ్చిన అక్షితలు, ఆలయం ఫొటోలను భక్తులకు అందచేశారు. రాత్రి ప్రతి ఇంటివద్ద దీపాలు వెలిగించి రాముడికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆత్మకూరు : పట్టణంలోని పంటవీధిలో ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల కల్యాణం నిర్వహించారు. అయోధ్యలో కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు టీవీలను ఏర్పాటు చేశారు.

సంగం : సంగం సత్రం సెంటర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా శివాజీ సెంటర్, వివేకానంద సెంటర్, కొరిమెర్ల, దువ్వూరు, మర్రిపాడు, వంగల్లు తదితర గ్రామాల్లోని కోదండ రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతసాగరం: స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిరం విశిష్టతను అర్చకులు భాను ప్రకాష్ తెలియజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

చేజర్ల : మండలంలోని ఆలయాల్లో సోమవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహంచి ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చేజర్లలోని లుంబిని విద్యాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించగా సీతారామ,లక్ష్మణ వేషదారణలో చిన్నారులు అలరించారు.


లింగసముద్రంలో పూజలందుకుంటున్న సీతారాములు

ఉదయగిరి: ఉదయగిరిలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. ఆనకట్ట సమీపంలో నుంచి శ్రీ రంగనాయకుల ఆలయం వరకు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలో పలు గ్రామాల్లోని రామ మందిరాల్లో శ్రీరాముని కల్యాణం అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు రామనామస్మరణతో భజనలు చేశారు.


సంగంలోని రామాలయంలో రామభక్తుల పూజలు


సీతారామపురం పడమటివీధి రామ మందిరంలో రామనామ స్మరణలో భక్తులు

ఉలవపాడు : అయోధ్యలో సోమవారం ఉదయం నుంచి ప్రారంభమైన బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అలాగే శ్రీరాముడి చిత్రపటం, కలశం ఏర్పాటు చేసి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు, భజన బృందాలు, భక్తులతో నగర సంకీర్తన చేశారు.

కావలి : పట్టణంలోని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, జై శ్రీరామ్ జెండాలు, రాములవారి ఫొటోలతో వెలిసిన ఫ్లెక్సీలతో అంతా రామమయంగా మారింది. రాములవారి చిత్రపటాలతో శోభయమానంగా చేపట్టిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని ఉత్తరంపేట రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడ నుంచి ర్యాలీగా దక్షిణంపేట రామాలయం వరకు కొనసాగించారు. ర్యాలీలో మహిళలు శ్రీరాముల వేషధారణలతో జయరామ జానకీరామ అంటూ ముందుకు సాగారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయాల కమిటీల బాధ్యులు, బీజేపీ, విశ్వహిందూపరిషత్ బాధ్యులు, వాసవీ వనితా క్లబ్ లెజెండ్ సభ్యులు, వాసవీ క్లబ్, సెవెన్ లయన్స్ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ అంగన్‌వాడీల ఆందోళన

కావలిటౌన్, జనవరి 22: అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను ఖండిస్తూ సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు పెంచలయ్య, మాల్యాద్రి మాట్లాడుతూ విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీలపై దౌర్జన్యం చేయడం అనాగరిక చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో తిరుపాల్, కృష్ణమోహన్, యూనియన్ నేతలు రఘురావవమ్మ, సుభాషిణి, కళావతి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కావలి రూరల్: తమ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి నాలుగు బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున కావలి రూరల్ పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న సీఐ శ్రీనివాసరావు బస్సులోని వారిని అంగన్‌వాడీలుగా గుర్తించి అనుమతులు లేకుండా చలో విజయవాడ వెళ్లటానికి లేదని వారిని స్టేషన్‌కు తరలించారు. అక్కడ మరుగుదొడ్లు, తాగునీరు కూడా సరిగాలేక ఇబ్బందులు పడ్డట్లు అంగన్‌వాడీలు తెలిపారు.


కందుకూరు : పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారంతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కావలిటౌన్: విధుల్లో చేరాలని లేనిపక్షంలో విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం జారీచేసిన నోటీసులను అంగన్వాడీలు తీసుకునేందుకు నిరాకరించారు. కావలి ప్రాజెక్ట్ పరిధిలోని దాదాపు 11,350 మంది అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్లు ఎవరూ విధులకు వెళ్లకుండా సమ్మెలో కొన సాగుతున్నారు.


ఆత్మకూరు : ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

కందుకూరు: అంగన్‌వాడీలు కందుకూరులో సోమవారం నిరసన ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీఐటీయూ నాయకులను అక్రమంగా అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ పోలీసుస్టేషన్‌ను ముట్టడించారు. తొలుత అంకమ్మ ఆలయం వద్ద నుంచి పోలీసుస్టేషన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పోలీసుస్టేషన్ ముందు బైఠాయించి నినాదాలు చేశారు. కందుకూరులో సీఐటీయూ నాయకులు జీ. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్‌లను నోటీసులు ఇస్తామని ఓ లాడ్జికి పిలిపించి అక్కడ నిర్బంధించటం దారుణమని విమర్శించారు. ఈ సందర్భంగా పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేసి రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్, డీ రామమూర్తి, సాదు చెన్నకేశవులు, అంగన్‌వాడీల సంఘం నాయకులు వాకా లతారెడ్డి, ఎం. జయలక్ష్మి, ఎస్కే అమీరున్నీషా, కె. రాజేశ్వరి, రహంతున్నీషా, సిహెచ్ ఇందిరావతి, ప్రభావతి, శశికళ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను అరెస్టు చేయడం ఏమిటని బోగోలు మండల సీపీఎం, సీఐటీయూ నేతలు ప్రశ్నించారు. సోమవారం బోగోలు సీపీఎం కార్యాలయంలో నేతలు తుమ్మల వెంకయ్య, చల్లా నరహరి విలేకరులతో మాట్లాడారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఈనెల 24న బంద్ చేస్తున్నామని ప్రకటించారు.

ఆత్మకూరు: ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని సీపీఎం, సీఐటీయు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తెలిపారు. విధుల్లో చేరని వారికి తొలగింపు ఉత్తర్వులు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసినా సోమవారం వారు విధులను బహిష్కరించి సమ్మెను కొనసాగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సీపీఎం, సీఐటీయు, ప్రజా సంఘాల నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు నాయకులు కె డేవిడ్‌రాజు, జి శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మి, రూత మ్మ, విజయలక్ష్మి, శ్రీదేవి, ఏ మస్తానమ్మ పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. విజయవాడలో జరుగుతున్న దీక్షా శిబిరాన్ని పోలీసులు అన్యాయంగా తొలగించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు బెదిరింపులకు బెదిరేది లేదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు అన్వర్ భాష, వేమ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరిరూరల్ : నిరాహార దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి రూరల్: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిరంకుశ విధానాన్ని అవలంబించడం దారుణమని సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అంగన్‌వాడీలకు మద్దతుగా నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలతో రాష్ట్ర బంద్ చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయమ్మ, నాయకులు ఫరుద్దీన్‌భాష, కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల తొలగింపునకు రంగం సిద్ధం

ఉలవపాడు : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో విధులకు హాజరుకాని 314 మంది అంగన్‌వాడీలను తొలగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సీడీపీవో వియజకుమారి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాలు ఉన్నాయి.

న్యాయాధికారికి సత్కారం


న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పోట్లూరి తదితరులు

కావలి,జనవరి22: స్థానిక అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారిగా సోమవారం జీ విక్రమసిన్హా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఏజీపీ పోట్లూరి శ్రీనివాసులు, న్యాయవాదులతో కలిసి ఆయన్ను సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాఘవరావు, జోసఫ్, కోమలి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

బోగోలు మాజీ సర్పంచి మణెమ్మ మృతి

బిట్రగుంట, జనవరి 22: బోగోలు మాజీ సర్పంచు బోగిరి మణెమ్మ (57) గుండెపోటుతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ వీరరఘు, సీనియర్ నాయకులు అంకులయ్య, రమణయ్య గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, నాయిబ్‌రసూల్, ప్రసాద్ తదితరులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే టీడీపీ నాయకులు కావ్య కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరావు, సుధీర్‌బాబు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మహిళ నేత అరుణమ్మ, సురేష్, ప్రముఖ న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నేతలు అంతరాజు, జహీర్, జాన్‌సన్, పీఎస్‌ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు పీ.వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జయరాజ్ తదితరులు మణెమ్మకు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పక్వానికి వచ్చిన పొగాకు ఆకులనే రెలపాలి

వలేటివారిపాలెం, జనవరి 22 : పొగాకులో పక్వానికి వచ్చిన ఆకులనే రెలపాలని కందుకూరు- 2వ వేలం కేంద్రం నిర్వాహణాధికారి రాజ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శాఖవరంలో సోమవారం రేకలలోని క్యూరింగ్ అయిన పొగాకు నాణ్యతను ఆయన పరిశీలిచారు. ఈ సందర్భంగా రైతులకు ఏర్పాటు శిక్షణలో మాట్లాడుతూ ఆకులు అల్లేటప్పుడు పట్టలపై ఉంచాలన్నారు. క్యూరింగ్ మీటరు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. క్యూరింగ్ తరువాత పొగాకు కర్రలను పందిళ్ల కింద ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజరు ప్రవీణ్‌బాబు, రామాంజనేయులు, ఉన్నం శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

27న సర్వసభ్య సమావేశం


ఉదయగిరిరూరల్, జనవరి 22: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల పరిధిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించడం జరుగుతుందన్నారు. కావున ప్రజాప్రతినిధులు, అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రతి గ్రామానికి మంచినీరు అందించటమే లక్ష్యం


కొత్తపల్లి సచివాలయం వద్ద మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

కావలి, జనవరి 22: భవిష్యత్తులో మంచినీటిని ప్రతి గ్రామానికి అందించాలనే లక్ష్యంతో కేంద్రం జలజీవన్ మిషన్ పనిచేస్తున్నదని కేంద్ర అధికార బృందం సభ్యులు ఎస్‌పీ సేథీ, డాక్టర్ జైభగవాన్ తెలిపారు. కావలి రూరల్ మండలం కొత్తపల్లి, చలంచర్ల, చెన్నాయపాలెం, ఆముదాలదిన్నె గ్రామాల్లో సోమవారం వారు గ్రామీణ నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పర్యటించారు. జలజీవన్ మిషన్ అమలు, స్వచ్ఛభారత్ పథకాల అమలును వారు పరిశీలించారు. ఇప్పటికే ఈ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలించి నీటి సరఫరా ఎలా ఉంది... అని స్థానికులను అడిగారు. స్వచ్ఛభారత్ అమలుపై సమీక్షించారు. ప్రజలను చైతన్యపరిచేలా స్థానిక పాలకులు కీలకపాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిపారుదల ఏఈ కృష్ణచైతన్య ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన్‌రంగా విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న వంగవీటి నరేంద్ర, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి తదితరులు

కావలిటౌన్, జనవరి22: కాపు నాయకుడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహ ప్రతిష్ఠకు సోమవారం పట్టణంలో భూమిపూజ జరిగింది. డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డులో జరిగిన భూమిపూజలో రంగా సోదరుడి కుమారుడు వంగవీటి నరేంద్ర, ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు కావ్య కృష్ణారెడ్డి, జనసేన నాయకులు అళహరి సుధాకర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీను, ఆళ్ల కోటేశ్వరరావు, ఆళ్ల శ్రీను, నువ్వులశెట్టి జెన్నీష్, తదితరులు పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా భూమి పూజా కార్యక్రమం జరిగింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కావలి రూరల్, జనవరి22: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన జూపూడి సాయికుమార్ (30) చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు, కావలి మండలం చెంచుగానిపాలెంకు చెందిన జూపూడి హరిప్రసాద్‌కు నలుగురు కుమారులు, కుమారుడు సాయికుమార్ ఉన్నారు. సెంట్రింగ్ పనిచేసే సాయికుమార్ నెమ్ముతో బాధపడుతూ ఈనెల 20న గ్రామానికి వెళ్లే రోడ్డు ఆర్పీ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.దీంతో అతన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తండ్రి హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం ఉండాలి


సంగీతను సత్కరిస్తున్న మహాకూటమి నాయకులు

కలిగిరి, జనవరి 22: క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉండాలని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి, లోక్ అదాలత్ సభ్యుడు ఎం. మాలకొండారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 9వతరగతి విద్యార్థిని చలంచర్ల సంగీత ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపగా, సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీమేశ్వరరావు, పీఈటీ మురళి, జయంపు కనకయ్య, ఎన్ జయలక్ష్మి, తుమ్మల అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల ర్యాలీ

కావలిటౌన్, జనవరి22: దివ్యాంగులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ట్రంకురోడ్డులో దివ్యాంగులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో హక్కుల వేదిక నేతలు ఇనాయత్ హుస్సేన్, సోమయ్య, వేణు, మహిబూబ్ బాష పాల్గొన్నారు.

ప్రచార కమిటీలో శ్రీనాథ్

కావలిటౌన్, జనవరి22: స్థానిక పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్ రాయలసీమ జోన్-1 వారాహి ప్రచార కమిటీలో సభ్యుడిగా నియమితులయ్యారు. సోమవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. తనకు సహకరించిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, జిల్లా నాయకులు కొట్టే వెంకటేశ్వర్లుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ ఉపకార వేతనానికి మనోజ్ ఎంపిక

కొండాపురం, జనవరి22: మండల పరిధిలోని గొట్టిగుండాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 8 వతరగతి చదువుతున్న వీ మనోజ్‌కుమార్ ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ ఉపకార వేతనానికి ఎంపికయినట్లు హెచ్‌ఎం అమరేందర్ సోమవారం తెలిపారు. మనోజ్‌కు ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లు ఉపకార వేతనం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్‌ను టీచర్లు, గ్రామస్థులు తదితరులు అభినందించారు.

నేడు మున్సిపల్ దుకాణాలకు వేలం

కందుకూరు, జనవరి 22: పట్టణంలోని రైతుబజారు పక్కన మున్సిపాలిటీ నిర్మించిన 18 రూములను అద్దెకు ఇచ్చేందుకు మంగళవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగవేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్. మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1,2,3 షాపులు ఎస్సీలకు, 5వ షాపు ఎస్టీలకు, 6 దివ్యాంగులకు, 7 నాయీబ్రాహ్మణులు లేదా వాషర్‌మెన్‌లకు రిజర్వ్ చేశామని, మిగిలిన రూములు జనరల్ కేటగిరిలో ఉంటాయని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 50వేలు ధరావత్తు చెల్లించాలని తెలిపారు.

పవన్‌ను సీఎం చేయటమే లక్ష్యం

కావలి,జనవరి22: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను సీఎం చేయటమే తమ లక్ష్యమని జనసేన రాయలసీమ ఎలక్షన్ కమిటీ సభ్యులు సిద్దూ, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో జరుగుతోన్న అవినీతి, దోపిడీపై పలు ఉద్యమాలు చేపట్టామన్నారు. రాబోయే ఎన్నికల్లో కావలి టికెట్ ఎవరికి ఇచ్చినా ఐక్యమత్యంగా పనిచేసి ఆ అభ్యర్థి విజయం కోసం కృషిచేస్తామన్నారు. సమావేశంలో నేతలు తోట వెంకట శేషయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, తిరుపతిస్వామి, ఆలూరు చంటి, విజయ్, రాజేష్, జయరాం, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు లోకేష్ జన్మదిన వేడుకలు

ఉదయగిరి రూరల్, జనవరి 22: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు చింతనబోయిన బయన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్ పాల్గొంటారన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన

ఆత్మకూరు, జనవరి 22: మండలంలోని నువ్వూరుపాడు ఎస్సీ కాలనీలో సోమవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ. 10 లక్షలతో నిర్మించనున్న రామాలయం నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం అప్పారావుపాళెంలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన అప్పారావుపాళెంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, అంగన్వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, సిమెంట్ రోడ్లు, తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ చిట్టమూరి జితేంద్రనాగ్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల తొలగింపునకు ఆదేశాలు

ఉదయగిరి, జనవరి 22: ఉదయగిరి సీడీపీవో కార్యాలయం పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను తొలగించేందుకు సీడీపీవో పచ్చవ లావణ్య సోమవారం ఆదేశాలు జారీచేశారు. సోమవారం ఉదయం 10 గంటల లోపు విధుల్లో చేరని 64 మంది కార్యకర్తలు, 57 మంది హెల్పర్లను తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు.

తుది ఓటర్ల జాబితా ప్రకటన

కావలి, జనవరి 22: ఓటర్ల తుది జాబితాను సోమవారం ఆర్డీవో శీనానాయక్ ప్రకటించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో 2,34,138 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 1,14,969 మంది స్త్రీలు 1,19,141 మంది, థర్డ్ జండర్స్ 28 మంది ఉన్నారన్నారు. అలాగే 3,403 మంది దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వారు 3,100 మంది, సర్వీస్ ఓటర్లు 92 మంది ఉన్నారని చెప్పారు. తుది ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోల వద్ద ఉందని, దాన్ని సరి చూసుకోవచ్చన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు ఏదైనా మార్పులు కాని ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ మాధవరెడ్డిలు పాల్గొన్నారు.

లింగసముద్రం: ఈసీ ఆదేశాల మేరకు సోమవారం మండలంలో ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. ఈసందర్భంగా తహసీల్దార్ టీ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో మొత్తం ఓటర్లు 30,791 మంది అని, వారిలో పురుషులు 15,448 మంది కాగా, మహిళలు 15,343 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

సంగం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు నాగరాజు తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో గతంలో మొత్తం 35,610 మంది ఓటర్లు ఉండగా 932 మంది ఓటర్లు తగ్గారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉదయగిరిరూరల్, జనవరి 22: పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఆవరణలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దారు శ్రీనివాసులురెడ్డి, ఎంఈవో మస్తాన్‌వలి పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా ర్యాంపు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వసతి ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

ఉదయగిరిరూరల్, జనవరి 22: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ట్యాబులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ శోభాయాత్ర

కమనీయం సీతారాముల కల్యాణం ● పాల్గొన్న వెంకయ్య కుటుంబం

వెంకటాచలం, జనవరి 22 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సోమవారం ఉదయం సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ దీపావెంకట్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. చిన్నారుల వేషధారణ, భక్తుల కోలాటాల నడుమ శోభాయాత్ర సాగింది. స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి సర్వేపల్లి క్రాస్ రోడ్డు మీదుగా దొడ్డరాజుపాళెం వద్దనున్న రామాలయం వరకు అక్కడి నుంచి ట్రస్ట్ వరకు యాత్ర సాగింది. సాయంత్రం అక్షర విద్యాలయంలో అయోధ్య రామ మందిర చిత్రాలతో గాలిపటాలు ఎగురవేశారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు.

● **పొదలకూరు :** పొదలకూరు పట్టణం రామ్‌నగర్ సెంటర్ నుంచి శ్రీనివాస లేఅవుట్ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు శ్రీరాముని శోభాయాత్ర వైభవంగా సాగింది. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆధ్యాత్మిక సంఘాలు, పలువురు వ్యక్తులు భక్తులకు ఆహార పదార్థాలు, తాగునీరు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల రమణయ్య నాయుడు, నిర్వాహకులు మన్నెం శ్యాంప్రసాద్, చొప్ప వెంకటేశ్వర్లు, కోనం బ్రహ్మయ్య, జ్యోతి, మాల్యాద్రి, వేణు, ఛత్రపతి మస్తాన్‌బాబు, కృష్ణమ నాయుడు, శ్రీనివాసులునాయుడు, దాసినేని ప్రసాద్, పాల్గొన్నారు. స్థానిక రామమందిరం వద్ద భక్తులకు వడపప్పు, పానకం పంచిపెట్టారు. అనంతరం రామమందిరంలో పూజలు నిర్వహిస్తున్న రామభక్తురాలు పులి శేషమ్మను స్థానిక బీజేపీ నాయకులు రాచపూటి ధనుంజయరావు, చింతగిం జల చిన్నసుబ్రహ్మణ్యం ఘనంగా సన్మానించారు. కాశినాయన, ఎల్ఐసీ జనార్దన్ రెడ్డి, నారాయణరెడ్డి, అమరా భగవన్, తోట పెంచలయ్య పాల్గొన్నారు.

నృసింహస్వామికి ప్రత్యేక పూజలు

రాపూరు(డక్కిలి) : బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని పెంచలకోన నృసింహస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నృసింహస్వామి, అమ్మవారి సన్నిధిలో 108 దీపాలతో పూజలు చేశారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. గాలిపాళెం పీఠాధిపతులు శ్రీహరి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. సహాయ కమిషనర్ జనార్దనరెడ్డి పర్యవేక్షించారు.

● **మనుబోలు :** మండలంలోని గ్రామాల్లో ఉన్న రామాలయాలన్నీ సోమవారం భక్తుల రామనామస్మరణతో మారుమోగాయి. మండలం కేంద్రంలోని పడమరవీధి రామమందిరంలో సీతారామలక్ష్మణ మూలవర్లకు, ఉత్సవమూర్తులకు క్షీర, పంచామృతాభిషేకాలను, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమరతసేవా మండల కన్వీనర్ ఆలూరు రాము ఆచారి, రామ మందిరాల ధర్మకర్తలు పాల్గొన్నారు.

● రామతీర్థంలో సీతారాముల కల్యాణం

విడవలూరు, జనవరి 22: మండలంలోని వివిధ రామాలయాల్లో వేడుకలను నిర్వహించారు. రామతీర్థంలో కామాక్షి సమేత రామలింగేశ్వరుడి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని భక్తులకు కనువిందు చేసింది. ఈ వేడుకలను గణేష్ యువశక్తి సంఘం, సంక్రాంతి కల్యాణ సమితి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, శ్రీరామ్ యువసేన, బాషా యూత్ ఫౌండేషన్, హసీని రెస్ట్ రూమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్లపల్లిలో నాయకులు వేగూరు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన కాలనీల్లో అన్నదానం చేశారు. వరిణి సర్పంచు రావిళ్ల మల్లికార్జున కూడా గ్రామంలో అన్నదానం చేశారు.



స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సీతారాముల కల్యాణం జరుపుతున్న వేదపండితులు

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీలోని చెన్నూరురోడ్డుతోపాటు పలు వీధులు సోమవారం రామనామ నినాదాలు, రామ భజనలు, మంగళ వాయిద్యాలతో మార్మోగాయి. స్థానిక కోదండరామస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి, బాబా మందిరాలు, శ్రీరాముడు, అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పెనుబల్లి, మినగల్లు, జొన్నవాడ, రేబాల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. బుచ్చిలో ఆర్యవైశ్యులు రాజా, హరనాథ్ ఎమ్మెస్, మహేష్, ఎంపీ టీసీ నారాయణ, వెంకటేశ్వర్లు, పెంచలప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో చలువ పందిళ్లు వేసి, భక్తులకు పొంగలి, పులిహోర తదితర ప్రసాదాలను అందచేశారు. కాళయకాగొల్లు, దామరమడుగు,పెనుబల్లితోపాటు జొన్నవాడలో వరదరాజస్వామి గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. జొన్నవాడ ఆలయంలో అర్చకులు, భక్తులు కలిసి రామనామ పఠనం చేశారు.



బుచ్చిలో గ్రామోత్సవం

వ్యవసాయ మోటారు చోరీ

మనుబోలు, జనవరి 22: మండల కేంద్రమైన మనుబోలులోని డొంకలో ఉన్న చింతల అమరనాథ్ పొలంలో వ్యవసాయ మోటార్ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. వివరాలిలా ఉన్నాయి. అమరనాథ్ పొలాన్ని మనుబోలు గ్రామానికి చెందిన పచ్చిపాల రామిరెడ్డి కౌలుకు తీసుకుని వరిసాగు చేస్తున్నాడు. సోమవారం మోటార్ వేసేందుకు వెళ్లగా మోటార్‌లో వైరు చోరీకి గురై ఉండడంతో రామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మనుబోలు, జనవరి 22: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మందా పెంచలయ్య (70) అనే వృద్ధుడు ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు... కోట గ్రామానికి చెందిన పెంచలయ్య మండలంలోని బద్దెవోలు గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం వేకువన బహిర్భూమికని రోడ్డుపక్కన వెళుతుండగా కొలనుకుదురు నుంచి గూడూరు వెళుతున్న గూడూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో పెంచలయ్యకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. దీంతో ప్రమాదానికి కారణమైన బస్సును స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాపూరులో నేడు డయల్ యువర్ డీఎం

రాపూరు(డక్కిలి), జనవరి 22 : స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల మధ్య డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని ఆర్టీసీ డిపో మేనేజరు అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ప్రయాణికులు నేరుగా కానీ ఫోన్ నెంబర్ 9959225651కి ఫోన్ చేసి సమస్యలను తెలియచేయవచ్చన్నారు.

బీజేపీ నేత మృతికి సంతాపం

మనుబోలు, జనవరి 22: బీజేపీ మండలాధ్యక్షుడు ఓడూరు శ్రీనువాసులు రెడ్డి మృతి బాధాకరమని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. ఈనెల 6వ తేదీన రోడ్డు ప్రమాదంలో శ్రీనువాసులురెడ్డి దుర్మరణం చెందారు. దీంతో సోమవారం సన్నారెడ్డి ఓడూరు నివాసం చేరుకుని శ్రీనువాసులురెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోలా శ్రీనువాసులు, కృష్ణారెడ్డి, అజయ్‌కుమార్ రెడ్డి, ఇరగరాజు వెంకయ్యలు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

తోటపల్లిగూడూరు, జనవరి 22 : మండలంలోని చిన్నచెరుకూరు క్రాస్ రోడ్డు వద్ద మద్యం సీసాలు తీసుకెళుతున్న టీ రోశయ్య అనే వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ శ్రీనివాసులు అదుపులోకి తీసుకున్నారు. 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ బాబు సతీష్, కానిస్టేబుల్ సీహెచ్ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేపల్లిలో టీడీపీకి తిరుగులేదు : సోమిరెడ్డి

● రెండు గ్రామాల నుంచి భారీగా టీడీపీలో చేరిక

వెంకటాచలం, జనవరి 22 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి తిరుగులేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని గూడ్లూరువారిపాళెం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నేత ఈపూరు మురళీధర్‌రెడ్డి, సతుకుమాటి సంతోష్‌లిద్దరూ కలిసి సోమవారం సోమిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వ ర్యంలో టీడీపీలో చేరారు. వీరితోపాటు గూడ్లూరువారిపాళెం పంచాయతీకి చెందిన యా నాటి రామిరెడ్డి, మారంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, నడవల ప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యు లు నడవల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లుతోపాటు తిరుమలమ్మపాళెం పంచాయతీకి చెందిన ముంగర శ్రీనివాసులు, పంచాయతీ ఉప సర్పంచ్ ముంగర మహేష్, మణి, ఆవుల మల్లికార్జున్, ముంగర మల్లికార్జున్ కూడా టీడీపీలో చేరారు. తొలుత పుంజులూరుపాడు నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాయకులు ప్రసంగించారు. సర్వేపల్లిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఓటమి తప్పదని, తోడేరుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సోమిరెడ్డి పేర్కొన్నారు.



మురళీధర్‌రెడ్డికి కండువా కప్పుతున్న సోమిరెడ్డి

కాకాణి ఆటలు సాగవు

సర్వేపల్లిలో మంత్రి కాకాణి ఆటలు ఇక సాగవని, రివర్స్ గేర్ ప్రారంభమైందని మాజీ మంత్రి సోమిరెడ్డి అన్నారు. గూడ్లూరువారిపాళెంలో సోమవారం సాయంత్రం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కుంకాల నాగేంద్రప్రసాద్, బొమ్మి సురేంద్ర, ఈపూరు సుబ్బారెడ్డి, రావూరి రాధాకృష్ణమనాయుడు, మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, ముంగర దశయ్య, కరుణాకర్‌రెడ్డి, స్నేహలతారెడ్డి, పత్రి మల్లికార్జున్, టీడీపీ నేతలు తదితరులున్నారు.

చట్టసభల్లో యానాదులకు అవకాశం కల్పించాలి : కేసీ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 22: చట్టసభల్లో యానాదులకు అవకాశం కల్పించాలని రాజకీయ పార్టీలను యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కేసీ పెంచలయ్య కోరారు. సోమవారం సాయంత్రం ఆయన మండలంలోని పోలినాయుడు చెరువు గిరిజన కాలనీలో యానాదులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలో 1500 గిరిజన కాలనీల్లో నాలుగు లక్షల మంది యానాదులు ఉండగా, వారిలో 1,80,000 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అయినా రాజకీయంగా అభివృద్ధికి నోచుకోలేకపోతున్నారన్నారు. కోవూరు నియోజకవర్గంలో యానాదులు అభివృద్ధికి ఆమడదూరంగా ఉన్నారన్నారు. అనంతరం యానాదుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవి, మహిళా నాయకురాలు ఉష, స్థానిక నాయకుడు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన వైసీపీ : దినేష్‌రెడ్డి

కొడవలూరు, జనవరి 22 : నాలుగేళ్ల పాలనలో వైసీపీ బీసీలను మోసం చేసిందని టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గమళ్లపాలెంలో సోమవారం ఇంటింటికి టీడీపీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో బీసీల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం బీసీలకు కార్పొరేషన్ ద్వారా రాయితీపై రుణాలు, చేయూత పథకాలను అందించిందని, నేడు బీసీల నిధులను వైసీపీ ప్రభుత్వం దోచుకున్నదన్నారు. బీసీలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెంచలబాబు యాదవ్, చెముకుల చైతన్య, నాపా వెంకటేశ్వర్లునాయుడు, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, చెక్క మదన్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల పంపిణీలో అక్రమాలపై కలెక్టర్‌కి ఫిర్యాదు

పొదలకూరు, జనవరి 22 : మండలంలో జరుగుతున్న అసైన్‌మెంట్ భూపట్టాల పంపిణీ అక్రమాలపై మండల టీడీపీ నాయకులు సోమవారం కలెక్టర్ హరినారాయణ్ కలిసి తగిన ఆధారాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం అర్హులైన పేదలకు పట్టాలు మంజూరు చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, నాయకులు బక్కయ్యనాయుడు, నెట్టెం పెంచలయ్య, కంకు నాగభూషణం, తిరుపతినాయుడు, ఆనంద్, హనుమ, పల్లారపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ల అక్రమ రిజిస్ట్రేషన్లు ఆపండి

మండలంలో అనధికారిక లే అవుట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అడ్డుకోవాలంటూ కలెక్టర్‌కు పొదలకూరు టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బా బు, నాయకులు కోడూరు భాస్కర్‌రెడ్డి, బి సుబ్బయ్య, సుబ్బా నాయుడు, వెంకటేశ్వర్లు, ఎం వెంకటేష్, ఎన్ సుందరరామిరెడ్డి, సురేష్, నారయ్య, మహేష్ పాల్గొన్నారు.

జగదేవిపేట పీహెచ్‌సీ తనిఖీ

ఇందుకూరుపేట, జనవరి 22: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీని) డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డుల డిస్ట్రిబ్యూషన్, సామాన్యులకు వైద్య సిబ్బంది ఆరోగ్యశ్రీపై కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని చెప్పారు. అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు 104కి కాల్ చేయాలని, 108 సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. వైద్యం పొందే సమయంలో ఎవరైనా లంచం అడిగితే 14400 ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, ఎంపీడీవో నాగేంద్రబాబు, హెచ్‌ఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడికి భక్తిశ్రద్ధలతో పూజలు

● రామనామ స్మరణతో మార్మోగిన నెల్లూరు నగరం

నెల్లూరు(సాంస్కృతికం) జనవరి 22: అయోధ్యలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన సందర్భంగా నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. రామనామస్మరణతో మారుమోగింది. శోభాయాత్ర వేడుకగా సాగింది. ప్రతి ఇంటా సీతారాముల పూజలు, సాయంత్రం దీపారాధనలు చేయడంతో దీపావళి వచ్చినట్లైంది. నగరంలో దాదాపు 150కిపై ఆలయాల్లో సీతారాములకి పూజలు, అభిషేకాలు, హోమాలు, భజనలు జరిగాయి. ఆలయాలు, వీధులు, వ్యాపార సంస్థలు, గృహాలపైన కాషాయ జెండాలు రెపరెపలాడాయి. బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ను తిలకించేందుకు జనం టీవీలు, ఫోన్లకు అతుక్కుపోయారు. నగరంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రసాదాల వితరణ చేపట్టారు. గాంధీబొమ్మ సెంటర్, శివాజీ సెంటర్, తదితర ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారం కోసం భారీ ఎల్ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, బీజేపీ నాయకులు వంశీకృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, మోదెం మల్లికార్జునరావు, స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపా వెంకట్, డాక్టర్ మారెం విజయలక్ష్మి, రాజేశ్వరి, తదితర నాయకులు పాల్గొని సీతారాములకు పూజలు, భజనలు చేశారు.

● మినీబైపాస్ రోడ్డులో పీటీ గోపాలచారి అండ్ సన్స్ పెట్రోలు బంకు వద్ద పచ్చని పందిరిలో శ్రీరామ పట్టాభిషేకం చిత్రపతం, శ్రీరామ విగ్రహాల కు విశేష పూజలు జరిగాయి. పీటీ జగన్నాథం దంపతులు వారి కుటుంబ సభ్యులు భక్తులతో కలిసి పూజలు చేశారు. భక్తవత్సలనగర్ సీతారామ మందిరంలో, పడారుపల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.

● విశ్వహిందూపరిషత్ బజరంగ్‌దళ్ మెంటా రామమోహన్‌రావు ఆధ్వర్యంలో సంతపేట 4 కాళ్ల మండపం నుంచి గాంధీ విగ్రహం వరకు శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. చిన్నబజార్ రాణాప్రతాప్ మిత్రమండలి ఆధ్వర్యంలో, పెద్దబజార్ రామమందిరం ఆధ్వర్యంలో, గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో పూజలు ప్రసాద వితరణలు జరిగాయి.

● శబరి శ్రీరామక్షేత్రంలో పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం అభిషేకాలు, శాంతి హోమాలు, శ్రీరామ భజనలు, కోలాటాలు, తదితర కార్యక్రమాలు జరిగాయి. రాత్రికి దీపాల అలంకరణ చేశారు.

● నగరంలోని పప్పులవీధిలో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో విశేష అభిషేకాలు, పూజలు, భక్తుల కోసం ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. పాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో, పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వర ఆలయంలో విశేష పూజలు, అన్నదానం జరిగింది.

● కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్చకుడు శివయ్యస్వామి ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, మహిళలు కాషాయ దుస్తులు ధరించి జెండాలతో జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. సీతారాములకు విశేష అలంకారం, ఉత్సవమూర్తులకు పూజలు జరిగాయి. భజనలు హోరెత్తాయి.

● బాలాజీనగర్ సీతారామ మందిరం ఆధ్వర్యంలో బాలరామునికి విగ్రహ ప్రతిష్ఠ పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్తలు త్యాగరాజ స్వామి కల్యాణ మండపం కమిటీ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగాయి.



కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో సీతారామలక్ష్మణులు



రంగనాథ స్వామి ఆలయంలో ప్రాకారోత్సవం



ఆకుపై రామమందిరం, సీతారాముల విగ్రహాలు



శ్రీరామనామం పలుకుతున్న భక్తులు



నెల్లూరు రూరల్ : శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



వేదాయపాళెంలో పూజలు చేస్తున్న భక్తులు



గాంధీబొమ్మ వద్ద చిన్నారుల నృత్య ప్రదర్శన

● ఆకులో అయోధ్య రామమందిరం

● హౌసింగ్ బోర్డింగ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు గంథవళ్ల ఉమామహేశ్వర్ రావు ఒకే ఆకులో అయోధ్య రాముని విగ్రహాలను కత్తిరించి సూక్ష్మ కళారూపాన్ని పొందించారు. ఈ సూక్ష్మ చిత్రం రూపొందించేందుకు ఆయన దాదాపు 5గంటలు శ్రమించినట్లు తెలిపారు.

● భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ దర్గా కోలుతో రామమందిరం తయారు చేశారు. స్థానికులు ఆ రామమందిరంలో సోమవారం పూజలు చేశారు.

● నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం రాత్రి దీపోత్సవం జరిగింది. బాలరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమం ఆలయ చైర్మన్ రత్నంజయరామ్, ప్రధాన అర్చకులు రఘురామశర్మ, సహాయకమిషనర్ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

● మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణ మందిరంలో సీతారామ స్వామిలకు భజనలు, పూజలు, దీపారాధనలు జరిగాయి.

● బీజేపీ రాష్ట్ర ఎస్‌మోర్చా ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, షరాబు లక్ష్మణ్, నటుకుల కిషోర్‌బాబుల ఆధ్వర్యంలో స్టోన్ హౌస్‌పేట ఎస్‌బీఐ పక్కన విశేష పూజలు జరిగాయి.

● విరాట్‌నగర్‌లోని పోతులూరి వీర బ్రహ్మేంద స్వామి ఆలయంలో సీతారాముల చిత్రపటానికి విశేష పూజలు జరిగాయి. భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ పాలక మండలి కమిటీ పర్యవేక్షించింది.

నెల్లూరురూరల్ : నెల్లూరురూరల్లో రాములోరి శోభయాత్ర నిర్వహించారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా కులమతాలతో అతీతంగా ప్రజలు పాల్గొని జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినదించారు. ధనలక్ష్మీపురంలో ముత్తుకూరు రహదారిపై శోభయాత్ర నిర్వహించారు. పెద్దచెరుకూరులో రాములవారి చిత్రపటం ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. గొల్లకందుకూరు రామాలయంలో భజనలు చేశారు. ములుముడి, సౌత్‌మోపూరు, నారాయణరెడ్డిపేట, కొత్తూరు, ఆమంచర్ల తదితర ప్రాంతాల్లో ఆలయాలన్నిటిని శోభయమానంగా అలంకరించిన కమిటీలు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. వేదగిరిపై రామనామస్మరణ చేశారు. బాలరాముని ప్రాణప్రతిష్ఠను ఇళ్లలో భక్తులు దీపారాధన చేసి, టీవీల్లో ప్రత్యక్షంగా వీక్షిరచారు.

'ఆర్ఎస్ఆర్'లో విద్యార్థులకు పోటీలు

నెల్లూరు(విద్య) : అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకినీ సహకారంతో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రామాయణంపై వారికున్న పరిజ్ఞానాన్ని వ్యక్త పరిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కేంద్రీయ విద్యాలయలో పరీక్షపై చర్చ

నెల్లూరు(విద్య), జనవరి 22 : కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయలో మంగళవారం పరీక్షపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టి వారిని సంసిద్ధులు చేసే దిశగా భారత ప్రధాని నరేంద్రమోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా మంగళవారం 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. **ఇన్నోవేటివ్ ఇండియా డాట్ మైజీఓవీ డాట్ ఇన్** లింక్ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో కూడా పాల్గొనడంతో పాటు తమ ఎంట్రీలను కూడా సమర్పించవచ్చని తెలిపారు.

'సిటీ' తుది ఓటర్ల జాబితా విడుదల

నెల్లూరు(సిటీ), జనవరి 22 : నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చెందిన తుది ఓటర్ల జాబితాను ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ సోమవారం విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలనుసారం సమ్మరి రివిజన్ నిర్వహించిన అనంతరం వచ్చి దరఖాస్తులన్నింటిని క్షుణంగా పరిశీలించాక తుది వివరాలను జాబితాలో పొందు పరిచినట్లు ఆయన పేర్కొన్నారు. 92,500 మంది ఓటర్లకు సంబంధించిన సవరణలను పూర్తి చేశామని, ఫారం-6 ద్వారా 58 వేల మందికి కొత్తగా ఓటు హక్కు కల్పించాలమని చెప్పారు. 248 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని 2,97,736 ఓటర్లు సిటీ నియోజకవర్గంలో గుర్తించి తుది జాబితాలో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ అంతా ముగ్గురు ఏఈఆర్వోల పర్యవేక్షణతో నిర్వహించి ఎక్కడ లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.



ఓటరు జాబితా విడుదల చేస్తున్న కమిషనర్

అభివృద్ధి చేస్తా.. ఆదరించండి : నారాయణ

● 40వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ

నెల్లూరు(వైద్యం), జనవరి 22 : వచ్చే ఎన్నికల్లో నన్ను ఆదరిస్తే నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని మాజీమంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ హామీ ఇచ్చా రు. సోమవారం 40వ డివిజన్‌లోని పల్లిమిట్ట, వాకర్స్‌రోడ్, మన్సూ ర్‌నగ ర్ ప్రాంతాలలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వ హించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు పలు సమస్యలను నారాయణ దృష్టికి తీసుకురాగా వాటిని అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజ్యలక్ష్మి, కృష్ణ, వేము అమ్ములు, చలం శీనయ్య, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం రంగనాథస్వామి కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), : సనాతన హిందూ ధర్మం ప్రచారంలో భాగంగా భక్తుల వద్దకు భగవంతుడు కార్యక్రమంలో సోమ వారం రాత్రి శెట్టిగుంటరోడ్డు, సత్రం బడి వద్ద శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం కమనీ యంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీని వాసులు, ఈవో డబ్బుగుంట వెంక టేశ్వర్లు పాల్గొన్నారు.

● మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో భక్తుల వద్దకే భగవంతుడు కార్యక్రమంలో భాగంగా గోమతీనగర్ కోటి ఇంద్రావతి ఫంక్షన్ హాలులో సోమవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఈవో, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణ వేదికపై కొలువుదీరిన మూలస్థానేశ్వరుడు

'సూరా'కు పీటీ వారెంట్

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 22 : వైసీపీ నాయకుడు సూరా శ్రీనివాసులురెడ్డిపైన సోమవారం బుచ్చి ఎస్ఐ మహేంద్ర పీటీ వారెంట్ వేశారు. మినగల్లులో బెల్టు దుకాణానికి మద్యం సరఫరా చేయించింది సూరానేనని విచారణలో తేలడంతో ఎస్ఐ పీటీ వారెంట్ వేశారని సీఐ హైమారావు సోమవారం తెలిపారు.

హామీలు అమలు చేయమంటే అరెస్టులా..?

నెల్లూరురూరల్, జనవరి 22 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగిన అంగన్‌వాడీలను అరెస్ట్ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్ విమర్శించారు. సోమవారం నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని అంగన్‌వాడీలు అప్పడిగ్గంధనం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్‌మోహన్, రసూల్, ప్రసాద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్‌లో విద్యార్థినుల ప్రతిభ

నెల్లూరు(విద్య), జనవరి 22 : తమిళనాడులోని ఓమలాపూర్‌లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన జాతీయ సౌత్‌జోన్ అండర్-14 క్రికెట్ పోటీల్లో నగరంలోని బీవీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన తులసి, రేష్మ, అక్షితలు ప్రతిభచాటారు. దీంతో సోమవారం పాఠశాలలో వారిని ప్రధానోపాధ్యాయిని పీ.విజయజ్యోతి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు పి.అజయ్‌కుమార్, రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.


టీడీపీని గెలిపించండి

నెల్లూరురూరల్, జనవరి 22 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కోరారు. సోమవారం 30వ డివిజన్ పరిధిలోని చంద్రబాబునగర్, శ్రామికనగర్, నక్కా గోపాల్‌నగర్ ప్రాంతాలలో ఎమ్మెల్యే సతీమణి సుజిత, కుమార్తెలు వైష్ణవి, హైందవిలు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందచేశారు. సైకిల్ గుర్తుకు ఓటేస్తే చంద్రబాబు సీఎం అవుతారని, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రచారం చేశారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 22: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రమాదభరిత ప్రయాణం చేయవద్దని ఎంవీఐ బాలమురళీకృష్ణ సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షకు హాజరైన వారికి సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో డ్రైవింగ్ చేయాలని సూచించారు. కారు నడిపే డ్రైవర్ ముందు సీట్లో ప్రయాణికుడు విధిగా సీట్‌బెల్ట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటారు వాహన తనిఖీ అధికారులు పూర్ణచంద్రరావు, రఘువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మొత్తం ఓటర్లు: 17.79 లక్షలు
పురుషులకన్నా ఎక్కువున్న మహిళా ఓటర్లు: 42324
2019 తర్వాత పెరిగిన ఓటర్లు : 67675



అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం : చంద్రగిరి(308916)
అత్యల్పంగా ఉన్నది : సత్యవేడులో (211378)
అత్యధికంగా పెరిగిన ఓటర్లు : తిరుపతి(27477)
ఓటర్లు తగ్గిన నియోజకవర్గం : వెంకటగిరి(1064)

దొంగ ఓట్ల సంగతేం చేశారు?

దొంగ ఓట్ల గోల జిల్లాలో హోరెత్తుతున్న నేపథ్యంలో తుది ఓటరు జాబితా సోమవారం విడుదలైంది. వైసీపీ నేతలు జిల్లాలో అనేక దొంగదారుల్లో ఓట్లు నమోదు చేయించారనీ, ప్రత్యర్థుల ఓట్లు తీసేయించారని ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాలమీదే ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. చంద్రగిరిలోనే లక్షకు పైగా దొంగ ఓట్లు నమోదయ్యాయని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో విడుదలైన తుది ఓటర్ల జాబితాను బూత్ లెవల్‌లో పరిశీలించిన తర్వాత విపక్షాలు ఎలా స్పందిస్తాయో చూడాల్సి ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- తుది ఓటరు జాబితా విడుదల
- ముసాయిదాపై ఫిర్యాదులు పరిష్కరించారా?
- బీఎల్‌ఏల పరిశీలన తర్వాతే నిగ్గుతేలే అవకాశం

67675మంది ఓటర్లు పెరిగారు

సోమవారం విడుదలైన తుది ఓటర్ల జాబితా మేరకు జిల్లాలో మొత్తం 17.79 లక్షల మంది ఓటర్లు వున్నారు. అందులో పురుష ఓటర్లు 8.68 లక్షలు కాగా మహిళా ఓటర్లు 9.10 లక్షలు, ఇతరులు 188 చొప్పున వున్నారు. పురుషుల కంటే 42324 మంది మహిళా ఓటర్లు జిల్లాలో అధికంగా వున్నారు. జిల్లా మొత్తం మీద చంద్రగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 3.08 లక్షల మంది ఓటర్లు వుండగా అత్యల్పంగా సత్యవేడు నియోజకవర్గంలో 2.11 లక్షల మంది ఓటర్లు వున్నట్టు జాబితా వెల్లడిస్తోంది. 2019 ఎన్నికల నాటితో పోలిస్తే జిల్లాలో ఓటర్ల సంఖ్య 67675 పెరిగింది. తిరుపతి సెగ్మెంట్‌లో అత్యధికంగా 27477మంది ఓటర్లు పెరగగా వెంకటగిరి సెగ్మెంట్‌లో ఓటర్ల సంఖ్య 1064 తగ్గింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా నమోదైంది.

తిరుపతి జిల్లా ఓటర్ల తుది జాబితా

నియోజకవర్గం	2023లో				2019లో	తేడా
	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు	మొత్తం ఓటర్లు	
గూడూరు	116982	123371	35	240388	236529	+3859
సూళ్ళూరుపేట	115802	121876	22	237700	231617	+6083
వెంకటగిరి	116936	122300	04	239240	240304	-1064
చంద్రగిరి	150249	158607	60	308916	291734	+17182
తిరుపతి	148101	150100	38	298239	270762	+27477
శ్రీకాళహస్తి	117635	125546	16	243197	237666	+5531
సత్యవేడు	102568	108791	13	211378	202771	+8607
మొత్తం	868273	910597	188	1779058	1711383	+67675

జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా వుండడం గమనార్హం. మహిళా ఓటర్లు ఎక్కువగా వున్న సెగ్మెంట్లలో చంద్రగిరి తొలి స్థానంలో వుంది. ఇక్కడ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 8358 మంది ఎక్కువగా వున్నారు. తిరుపతిలో కేవలం 1999 మంది మహిళలు మాత్రమే ఎక్కువగా వుండడం గమనార్హం.

అందరి దృష్టీ చంద్రగిరి పైనే!

ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదలైన నేపథ్యంలో అందరి దృష్టీ చంద్రగిరి నియోజకవర్గంపైనే కేంద్రీకృతమైంది. గతేడాది జనవరిలో మొదలై ఇటీవల ముగిసిన ముసాయిదా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చంద్రగిరి నియోజకవర్గంలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో దొంగ ఓటర్లు నమోదయ్యారని, పలు ఇతర అవకతవకలు చోటుచేసుకున్నాయని టీడీపీ బీఎల్‌ఏల నుంచీ టీడీపీ అధినేత చంద్రబాబు వరకూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. చంద్రగిరి టీడీపీ ఇంచార్జి పులివర్తి నానీ అయితే ఓటర్ల నమోదు అక్రమాలపై పెద్ద కసరత్తే చేశారు. ప్రత్యేకంగా సిబ్బందిని, పార్టీ నాయకులను, కార్యకర్తలను పెట్టుకుని ఒక పోరాటమే నడిపారు. తప్పుడు క్లెయిమ్ ఫామ్‌లు అప్‌లోడ్ చేయడం మొదలుకుని మృతుల పేర్లు తొలగించకపోవడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం, బయటి వారి పేర్లు నమోదు చేయించడం, డోర్ నంబర్లు, ఫోటోలు లేకుండా ఓటర్లను నమోదు చేయడం.. ఇలా సవాలక్ష అవకతవకలను గుర్తించారు. వాటిపై తహసిల్దార్ల దగ్గర నుంచీ కలెక్టరు, ఎన్నికల సంఘం వరకూ అసంఖ్యాక ఫిర్యాదులు చేశారు. వాటిపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది కూడా. గత డిసెంబరు, ఈ నెల రెండుసార్లు విజయవాడలో జరిపిన సమీక్షల్లో ప్రత్యేకంగా చంద్రగిరి గురించి అధికారులను లోతుగా ప్రశ్నించారు. అక్కడి నుంచే ఎందుకు అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని నిలదీశారు. ఉదాసీనంగా వుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాంతో జిల్లా యంత్రాంగం హడావిడిగా చర్యలకు దిగింది. ఆ క్రమంలోనే క్లయిమ్ ఫామ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించని 24మంది బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. అప్పటి వరకూ పెద్ద సంఖ్యలో పెండింగులో వున్న వివిధ రకాల క్లయిమ్‌లను శరవేగంగా పరిష్కరించింది. అయినా టీడీపీ నుంచీ ఆరోపణలు, ఫిర్యాదులు ఆగడం లేదు. ఈనెల 8వ తేదీన పులివర్తి నానీ తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట దొంగ ఓట్లు తొలగించాలంటూ నిరాహార దీక్షకు దిగిన సంగతి తెలిసిందే. పోలీసులు దీక్షను భగ్నం చేసేందుకు రాగా ఆయన పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆ సందర్భంగా ఆయన అస్వస్థతకు లోనయ్యారు కూడా. ఓవైపు టీడీపీ ఎదురుదాడి, మరోవైపు ఈసీ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగానికి ఊపిరి సలపలేదు. ఈ క్రమంలో సోమవారం తుది జాబితా విడుదలైంది. గత ఎన్నికల నాటితో పోలిస్తే అక్కడ 17182 మంది ఓటర్లు పెరిగారు. అయితే మునుపటి జాబితాలో ఎన్ని ఓట్లు తొలగించారు, ఎన్ని ఓట్లు చేర్చారు అనే వివరాలు తెలియాల్సి వుంది. జాబితాలు పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలించాక గానీ, ఇచ్చిన అభ్యంతరాలు పరిష్కరించారా లేదా అనేది తెలిసే అవకాశం లేదు.

జై శ్రీరామ్



సూళ్లూరుపేట రామాలయంలో లక్ష తులసిదళ పూజ

అయోధ్య రామాలయంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ట సంబరాలు సోమవారం జిల్లావ్యాప్తంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సంకీర్తనా యజ్ఞాలు, శోభాయాత్రలు, అన్నదానాలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో యువత పెద్దఎత్తున పాల్గొనడం విశేషం. రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ట ప్రత్యక్ష ప్రసారాలను జనమంతా శ్రద్ధగా వీక్షించడం కన్పించింది.



తిరుపతి వీధుల్లో మార్వాడీల శోభాయాత్ర



తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో 24గంటల అన్నమయ్య సంకీర్తనాయజ్ఞం

అంగన్వాడీల సమ్మె విరమణ

- 'ఛలో విజయవాడ'ను భగ్నం చేసిన పోలీసులు
- నేటినుంచి విధులకు హాజరు



తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్బంధించడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి అంగన్వాడీల ఆందోళన

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్ల సాధనకోసం 42 రోజులుగా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తల సమ్మె ముగిసింది. సోమవారం రాత్రి ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలవంతం కావడంతో అంగన్వాడీలు మంగళవారం నుంచీ విధులకు హాజరు కానున్నారు.కాగా కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం అంటూ తిరుపతి జిల్లానుంచి ఆదివారం రాత్రి ఛలో విజయవాడ కార్యక్రమానికి బయల్దేరిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు.చాలావరకూ గృహనిర్బంధంలో వుంచారు.వారి కళ్లుగప్పి వెళ్లిన వారిని కావలిలో అరెస్టు చేసి స్టేషన్లో నిర్బంధించారు. తరువాత తిరుపతికి తీసుకొచ్చి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్బంధించారు. రాత్రి 9గంటల వరకు వారిని బయటకు రానివ్వలేదు. ఆందోళనకు సిద్ధమవుతున్న క్రమంలో వారిని విడిచిపెట్టారు. ఈలోపు పగలు పలుచోట్ల అంగన్వాడీల దీక్షా శిబిరాలను కూల్చారు.అణిచివేత చర్యలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా సోమవారం అంగన్వాడీలు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు.కాగా అంగన్వాడీలపై అణిచివేత ధోరణులను ఆపివేయాలని అఖిలపక్ష నేతలు డిమాండు చేశారు. సోమవారం కలెక్టర్ వెంకటరమణా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

3362 మంది అంగన్వాడీ సిబ్బందిపై వేటు !

సమ్మె చేస్తున్న అంగన్వాడీ సిబ్బందిపై సోమవారం జిల్లా అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. విధులకు హాజరు కావాలని ఆదేశిస్తూ జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఖాతరు చేయని సిబ్బందిపై తొలగింపు వేటు వేసింది. 1834 మంది వర్కర్లను, 1528 మంది హెల్పర్లను ఉద్యోగాల నుంచీ తొలగించిన ఉత్తర్వుల ఫైలును కలెక్టర్ ఆమోదం కోసం సోమవారం రాత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి కలెక్టరేట్‌కు పంపించారు.అయితే ఈలోపు ప్రభుత్వంతో అంగన్వాడీ యూనియన్ నేతలు జరిపిన చర్చలు ఫలవంతం కావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు అంగన్వాడీలు ప్రకటించారు. మంగళవారం నుంచీ విధులకు హాజరు కానున్నట్లు తెలిపారు.

ర్యాంకర్ ఎస్‌ఐల బదిలీ

- 9మంది జిల్లానుంచి బయటకు
- ఆరుగురు ప్రకాశం నుంచి తిరుపతికి


తిరుపతి(నేరవిభాగం), జనవరి 22: ఎన్నికల నియమావళి మేరకు జిల్లాలో పలువురు ర్యాంకర్ ఎస్‌ఐల బదిలీలు జరిగాయి. గుంటూరు సౌత్‌కోస్టల్ జోన్ పరిధిలో పదోన్నతులద్వారా ఎస్‌ఐ ర్యాంకులు పొంది, సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారిని ఇతర జిల్లాలకు బదిలీచేస్తూ సౌత్‌జోన్ ఇన్స్‌పెక్టర్ జనరల్ సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న టీసీ కృష్ణయ్య, ఎం. జ్ఞానశేఖర్, కె. వెంకటేశ్వర్లు, ఎం.వేణుగోపాల్, వి. ప్రేమయ్య, ఇ. వెంకయ్య, పి. సుబ్రహ్మణ్యంలను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న కె. శ్రీనివాసరావు, ఎస్‌డీ మీరాసాహెబ్, ఎస్‌కే అమీర్, యు. సుబ్బారావు, జి. సుబ్రహ్మణ్యం, కె. వేణుగోపాల్‌ను తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు.

ఇద్దరు సీఐలకు స్థాన చలనం

జిల్లాలో ఇద్దరు సీఐలకు స్థానచలనం కలిగింది. పాకాల సీఐ జి.ఓబులేసును పుత్తూరుకు,ఏర్పేడు సీఐ వి.శ్రీహరిని బీఎన్ కండ్రిగకు బదిలీ చేస్తూ కర్నూలు రేంజి డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అయ్యో పసిబిడ్డ...!

- స్కూలు నుంచి బస్సులో ఇంటికి వచ్చిన అన్న
- అదే బస్సు కింద పడి చనిపోయిన తమ్ముడు
- ఎంఎంసీ కండ్రిగలో పెనువిషాదం



దేవాన్ష్ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, జనవరి 22: బడికి వెళ్లిన అన్న బస్సులో తిరిగి ఇంటి వద్దకు వచ్చాడు. అమ్మ చేయి పట్టుకుని అన్న కోసం మూడేళ్ల బాలుడు సంతోషంగా బస్సు వద్దకు వెళ్లాడు.ఆ ఉత్సాహంలో అమ్మ చేయి వదిలిపెట్టిన ఆ పసిబిడ్డ బస్సు కింద పడి చనిపోయాడు. శ్రీకాళహస్తి మండలం మ(న్ని)రిమాకుల చేను కండ్రిగలో సోమవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది.రూరల్ సీఐ అజయ్ కుమార్ కథనం మేరకు.. మ(న్ని)రిమాకుల చేను దళితవాడకు చెందిన చిన్న కాటయ్య ఓ కర్మాగారంలో దినసరి కూలీగా పని చేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు కుమారులు.ఐదేళ్ల వయసున్న పెద్ద కొడుకును శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ కార్పొరేటు పాఠశాలలో చదివిస్తున్నాడు. రోజూ పాఠశాల బస్సులోనే వెళ్లి వస్తుంటాడు.సోమవారం సాయంత్రం స్కూల్ బస్సు ఇంటి వద్దకు వచ్చింది. తల్లి ఆదిలక్ష్మి చిన్న కొడుకు దేవాన్ష్‌ను వెంటబెట్టుకుని బస్సు వద్దకు వెళ్ళింది. పెద్ద కొడుకును కిందకు దించుకునే సమయంలో దేవాన్ష్ అమ్మ చేయిని జారవిడిచి పక్కకు వెళ్లాడు.స్కూల్ బస్సు ముందుకు కదలడంతో బస్సు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు.గుండెలు బాదుకుంటూ హుటాహుటిన చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి శివారులోని వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.పోలీసులు స్కూలు బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు.

రెడ్డిచెరువులో యువకుడి గల్లంతు

ఎర్రావారిపాలెం, జనవరి 22 : చేపలు పట్టేందుకు తమ గ్రామస్తులతో పాటు వెళ్ళిన ఓ యువకుడు చెరువులో గల్లంతయ్యాడు. రెండు రోజులుగా చెరువులో గాలిస్తున్నా ఆచూకీ దొరక్కపోవడంతో నిండు గర్భిణి అయిన అతడి భార్యను సముదాయించడం ఎవరివల్లా కావడంలేదు.ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ ఆదిఆంధ్రవాడకు చెందిన గల్లా సిద్ధయ్య కుమారుడు గణేష్ (24) భార్య జయంతి ప్రస్తుతం నిండు గర్భిణి.ఊరికి ఆనుకునే ఉన్న రెడ్డిచెరువులోకి చేపలు పట్టేందుకు ఆదివారం గ్రామానికి చెందిన దుగ్గిపాక వెంకటరమణ, సంగీతం సుబ్రమణ్యం వలలు తీసుకొని పోతుండగా గణేష్ తానూ వస్తానని అడిగాడు. అప్పటికే గణేష్ మద్యం మత్తులో ఉండడంతో వద్దని వారించి వారు చెరువులోకి వెళ్ళారు. చేపల వేట ముగించుకుని గట్టుమీదకు వచ్చిన ఆ ఇద్దరికీ అక్కడ గణేష్ షర్ట్, లుంగీ కనపడ్డాయి. గణేష్‌ను పేరు పెట్టి గట్టిగా పిలిచినా పలక్క పోవడం, నీటిలో వెతికినా జాడలేకపోవడంతో ఇంటికి వెళ్ళాడేమోనని ఊర్లోకి వచ్చి విషయం చెప్పారు. ఇంటివద్ద గణేష్ లేకపోవడంతో చెరువులో మునిగిపోయాడేమోనని అనుమానించారు.సోమవారం కూడా రెడ్డిచెరువులో సర్పంచ్ లోకేష్ ఈతగాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టారు. చెరువులో చాలా లోతు నీళ్ళుండడంతో గణేష్ ఆచూకీ కానరాలేదు.దీంతో పోలీసులకు సర్పంచ్ లోకేష్ సమాచారం అందించారు. మంగళవారం గణేష్ జాడ కనుగొంటామని పోలీసులు తెలిపారు.



గణేష్

నేడు, రేపు జాతీయస్థాయి విద్యాసమ్మేళనం
రేపు సీఎం జగన్, మంత్రి బొత్స హాజరు

తిరుపతి(విద్య),జనవరి 22 : తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో మంగళ, బుధవారాల్లో ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ పేరిట జాతీయస్థాయి విద్యాసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డీఈవో శేఖర్ ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 5.15గంటలకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.అడాప్టింగ్ ఎక్సలెన్స్, విద్యలో డిజిటల్ రెవెల్యూషన్, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేఅంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. బుధవారం సాయంత్రం 5.15గంటలకు జరిగే సెషన్‌ను సీఎం జగన్ ప్రారంభిస్తారని, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ హాజరవుతారని పేర్కొన్నారు.

క్రికెట్ పోటీల విజేత డి.వడ్డిపల్లి జట్టు


విజేత డి.వడ్డిపల్లి జట్టుకు నగదు, షీల్డు అందజేస్తున్న నిర్వాహకులు

దక్కిలి, జనవరి 22: మండల కేంద్రమైన దక్కిలిలో పిన్నక కొండయ్య, రత్నమ్మ జ్ఞానకార్థం కొండయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో మండలం నుంచి మొత్తం 35 జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో కమ్మపల్లి రోడ్డు జట్టు, డి.వడ్డిపల్లి జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన డి.వడ్డిపల్లి జట్టు 12 ఓవర్లలో 106 పరుగులు తీసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కమ్మపల్లి రోడ్డు జట్టు 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 95 పరుగులతో ఓటమిపాలైంది. బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా కమ్మపల్లి రోడ్డు జట్టుకు చెందిన దేశరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బెస్ట్ బౌలర్‌గా యువరాజ్ ఎంపికయ్యారు. విన్నర్‌కు రూ.40 వేలు నగదు, షీల్డు, రన్నర్‌కు రూ.20 నగదు, షీల్డు, బెస్ట్ బ్యాట్స్‌మేన్, బౌలర్‌కు రూ.1116 నగదు, షీల్డులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హజరైన ఎంపీడీవో ప్రసన్న మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు మంచి నడవడిక అలవడుతుందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్, ఎంఈవోలు పిన్నక జగదీష్‌బాబు, వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సలహా మండలి మాజీ ఛైర్మన్ చెలికం భాస్కరరెడ్డి, వెంకటగిరి ఏఎంసీ మాజీ డైరెక్టర్ కోళ్లపూడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనతోనే బీసీలకు స్వర్ణయుగం: పాశిం


బస్సుయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న పాశం, టీఎన్‌టీయూసీ నేతలు

కోట, జనవరి 22: టీడీపీ పాలనతోనే బీసీలకు స్వర్ణయుగం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోటలోని షాదిమంజిల్‌లో సోమవారం కోట, వాకాడు మండలాల జయహో బీసీ సదస్సు జరిగింది. ముందుగా చంద్రన్న కార్మిక బస్సుయాత్ర కరపత్రాలను పాశిం సునీల్‌కుమార్‌తో పాటు టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సింధూజ, బీసీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇచ్చింది టీడీపీనేనని అన్నారు. సీఎం జగన్ నా బీసీలు అంటూనే బలహీన వర్గాలను అణగదొక్కుతున్నారని విమర్శించారు. వార్డు నెంబరు నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు బీసీలకు సముచిత స్థానం కల్పించలేదన్నారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, మళ్లీ బీసీలకు మంచిరోజులు వస్తాయని అన్నారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రుద్రకోట సధాశివం మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీ కార్పొరేషన్లు పెట్టి కోట్లాది రూపాయల లబ్ధి చేకూర్చిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం జగన్ అధికారంలోకి రాగానే కార్పొరేషన్లు ఎత్తేసి బీసీ ద్రోహిగా మిగిలిపోయారన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.75 వేల కోట్లను దారి మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంతా ఏకమై వైసీపీని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి తీగల సురేష్‌బాబు, వెంకన్నపాళెం సర్పంచు మధుయాదవ్, కందల బాలకృష్ణయాదవ్, దోసకాయల కృష్ణమూర్తి, కోటా శ్రీనివాసరావు, బత్తిన ప్రమీల, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, పురిణి శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య, ఉలసా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అవినీతి జరిగి ఉంటే నిరూపించండి: రాంకుమార్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జనవరి 22: వెంకటగిరి నియోజకవర్గం సైదాపురంలో అవినీతి జరిగి ఉంటే నిరూపించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ సైదాపురంలో తెల్లరాయిని అక్రమంగా రవాణా చేసి దోచుకుంటున్నారని చేసిన మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అబద్ధమన్నారు. సైదాపురంలో మైనింగ్ చేస్తోంది టీడీపీ నేతలేనని అన్నారు. మంత్రి పదవి ఇవ్వలేదని ఆనం పార్టీని వీడి వెళ్లిపోయారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా గెలుపు తనదేనని రాంకుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలది విహారయాత్ర: నెలవల

నాయుడుపేట టౌన్, జనవరి 22: వైసీపీ నేతలు చేస్తున్నది సామాజిక సాధికారిక బస్సుయాత్ర కాదని, విహారయాత్ర అని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అలాంటప్పుడు సామాజిక సాధికారిక బస్సుయాత్రలు ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో ఓటు అనే ఆయుధంతో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

ఎస్ఈబీ సీఐగా రమేష్



గూడూరు, జనవరి 22: గూడూరు ఎస్ఈబీ సీఐగా రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ గుంటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు నుంచి బదిలీపై వచ్చిన రమేష్ బాధ్యతలు తీసుకున్నారు.

కూలీపై దాడి

బాలాయపల్లి, జనవరి 22: కూలీపై దాడికి పాల్పడిన ఘటన మండలంలోని వాక్యం గ్రామంలో సోమవారం జరిగింది. బాధితుడి కథనం మేరకు... గ్రామానికి చెందిన దారా వెంకటయ్య మరో ఐదుగురితో కలసి అదే గ్రామానికి చెందిన రైతు కోలా నరేష్ పొలంలో కూలి పనులకు వెళ్లాడు. పనిచేస్తుండగా కొమ్మి నాగయ్య, కొమ్మి శ్రీనివాసులు అనే వ్యక్తులు వివాదానికి దిగి వెంకటయ్యపై దాడి చేశారు. అతనిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.


గూడూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు


నాయుడుపేటలో సీతారాముల కల్యాణం


పెళ్లకూరు మండలం భీమవరంలో గ్రామస్తుల పూజలు


కోట మండలం గూడలిలో సీతారాముల ఊరేగింపు



గూడూరు సాయిసత్సంగ నిలయంలో భజనలు చేస్తున్న భక్తులు - నాయుడుపేట మండలం విన్నమాల పట్టాభిరామ ఆలయంలో అఖండజ్యోతి వెలిగింపు

రామనామంతో మార్మోగిన ఆలయాలు

గూడూరు, జనవరి 22: పట్టణంలోని ఆలయాలు శ్రీరామనామంతో మార్మోగాయి. అయోధ్యలో సోమవారం నిర్వహించిన శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాల్లో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు, ప్రజలు పూజలు చేపట్టారు. బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, వాసుదేవరావు, సంజీవనాయుడు, మనోజ్‌కుమార్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాజావీధిలోని రామాలయం వద్ద వ్యాపారులు పూజలు జరిపి పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, అన్నదానం చేశారు. స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో స్వామివారికి లక్షతులసి అర్చన, వేద పారాయణం, శ్రీరామకీర్తన నిర్వహించారు. ఉభయదాతలుగా శ్రీకంటి రామమోహన్‌రావు, డాక్టర్ జనార్దనరెడ్డి, కృష్ణంరాజు, రామసుబ్బారెడ్డి, పూర్ణచంద్రరావు, పవన్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో మురళీరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, రహనయ్య, ప్రసాద్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు. స్థానిక సాయిసత్సంగనిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీరాముని విగ్రహానికి పూజలు చేసి భజనలు నిర్వహించారు.

నాయుడుపేట: మండలంలోని విన్నమాల గ్రామంలో ఉన్న పట్టాభిరామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో వేదపండితులు సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అఖండజ్యోతిని వెలిగించారు. ఏఎంసీ మాజీ అధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల కిందట పట్టాభిరామ ఆలయాన్ని వేణుంబాక పట్టాభిరామిరెడ్డి నిర్మింపజేశారని తెలిపారు. గ్రామపెద్దలు, ప్రజల సహకారంతో ఆలయాన్ని పునఃనిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేణుంబాక లక్ష్మీనారాయణరెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సురేంద్ర, రుషి, పుదూరు రత్నం తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీరామమందిరం, శివాలయం వీధిలోని రామమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద రాముడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాలు వెలిగించి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. గాదిరెడ్డి గోపీ, బిరదవాడ శ్రీనివాసులు, గందవళ్లి సిద్ధయ్య, అంజయ్య, పెనల రమేష్‌బాబు, పెనల కిషోర్‌బాబు, యుగేష్‌రాజు, సుందరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: అయోధ్య బాలరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణ పురవీధుల్లో రామ, లక్ష్మణ, హనుమాన్ వేషధారులతో ర్యాలీ చేపట్టారు.

కోట: పట్టణంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకుల ఆధ్వర్యంలో హనుమాన్ సమేత సీతారామచంద్రుల శోభాయాత్ర జరిగింది. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం నుంచి గోపాల్‌రెడ్డి విగ్రహం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అదేవిధంగా గూడలిలోని రామమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సారంగం రమేష్‌బాబు, వాసు, చేవురు శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తడ: మండలంలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న సీతారామ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం కల్యాణం నిర్వహించారు. అలాగే వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో రాములవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీసిటీ చిన్మయా విద్యాలయం విద్యార్థులు కాషాయదుస్తులను ధరించి తడలో ర్యాలీ నిర్వహించారు. ఆటో యూనియన్ అన్నదానం చేసింది.

సూళ్లూరుపేట: పట్టణంలోని ఆలయాలు రామనామ స్మరణలతో మార్మోగాయి. భక్తులు రామనామ కీర్తనల భజనలు చేశారు. సీతారాముల ఆలయంలో కలశ స్థాపన, లక్షతులసి పూజ చేశారు. అదేవిధంగా బాలాంజనేయస్వామి ఆలయంలో లక్ష తులసి దళాలతో స్వామివారికి అర్చన చేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పూజలో పాల్గొన్నారు. పాండురంగస్వామి ఆలయం, షార్ బస్టాండు వద్దనున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పెళ్లకూరు: చిల్లకూరు వడ్డిపాలెంలోని చండికాపరమేశ్వరీదేవి, జీలపాటూరు, భీమవరం, చెంబేడు, తాళ్వాయిపాడు గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేశారు. భీమవరంలో టీడీపీ సీనియర్ నేత దామెర ప్రసాద నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో ఉన్న కామాక్షీదేవి, సమేత మార్కెండేశ్వరస్వామి, రామసాయి మందిరంలో సీతా రాముల కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితులు గూడలి సుధీర్‌శర్మ స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఉభయకర్తలు వెంకటసుబ్బారెడ్డి, నాగేశ్వరమ్మ, దువ్వూరు శేషురెడ్డి, రమణారెడ్డి, దేవస్థానం నిర్వాహకులు పాల్గొన్నారు.



తడలో కాషాయ దుస్తులతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు - వెంకటగిరిలో రామభక్తుల హనుమాన్ శోభాయాత్ర

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: సీఐటీయూ




గూడురులో దీక్ష చేస్తున్న అంగన్వాడీలు - సూళ్లూరుపేటలో నిరసన ర్యాలీ

గూడూరు, జనవరి 22: రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులతో అంగన్వాడీల ఉద్యమాన్ని ఆపలేదని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 42వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరం నుంచి ప్రదర్శనగా టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రజల నుంచి మద్దతుగా సేకరించిన కోటి సంతకాలను సీఎం జగన్‌కు సమర్పించేందుకు విజయవాడకు బయలుదేరిన అంగన్వాడీలను పోలీసులు నిర్బంధించడం దారుణమన్నారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 42 రోజులుగా అంగన్వాడీలు దీక్షలు చేస్తుంటే సీఎం జగన్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గపు చర్య అన్నారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ప్రభావతి, శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, మునికుమారి, లక్ష్మి, పెంచలమ్మ, సుబ్బయ్య, చంద్రయ్య, రమణయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: అంగన్వాడీలు 42 రోజులుగా సమ్మెలో ఉంటే ప్రభుత్వం పట్టించుకోకుండా మొండి వైఖరితో వ్యవహరించడం సమంజసంకాదని సీఐటీయూ నాయకుడు పద్మనాభయ్య అన్నారు. ఛలో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకోవడంతో సోమవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనం కోసం అంగన్వాడీలు పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం విధుల నుంచి తొలిగిస్తామని బెదిరించడం మానుకోవాలన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, తమ డిమాండ్లను అంగీకరించే వరకు ఉద్యమం ఆగదన్నారు. సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, అల్లెయ్య పాల్గొన్నారు.

కోట: వాకాడు, చిట్టమూరు, కోట మండలాలకు చెందిన 85మంది అంగన్వాడీ వర్కర్లను కోట పోలీసులు సోమవారం బైండోవర్ చేసుకున్నారు. అంగన్వాడీ వర్కర్లు ఛలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా రెండు ప్రైవేట్ బస్సుల్లో వెళ్తుండగా కావలి వద్ద అక్కడి పోలీసులు అడ్డుకున్నారు. బస్సులతో సహా అంగన్వాడీ వర్కర్లను కోట పోలీసులకు అప్పగించగా సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతరం అంగన్వాడీ వర్కర్లు స్థానిక దీక్షా శిబిరానికి చేరుకున్నారు.

వెంకటగిరి టౌన్: అంగన్వాడీల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మె సోమవారం 42రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమకు తగ్గ ప్రతిఫలం అడిగితే ఉద్యోగులపై ఆంక్షలు విధించడం దారుణమన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, అన్నపూర్ణ జోతి, ఉమా, కుసుమ మాధవి, కోటీశ్వరి, అమరావతి, రమణమ్మ, మునీరుష, సుప్రియ, గీత, శివకుమారి, నాగమణి, గౌరి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

పెళ్లకూరు, జనవరి 22: ప్రజారోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కానూరు, దిగువ చావాలి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. కార్యక్రమంల ఎంపీడీవో సురేష్‌బాబు, పెళ్లకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాతమ్మ, ఎంఈవో మించల శంకరయ్య, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరి, చావాలి సర్పంచు శ్రీపతి ధనలక్ష్మి, ఎంపీటీసీ చింతకాని శ్యామలమ్మ, కానూరు సర్పంచు రత్నమ్మ, ఉప సర్పంచు మనుబోలు గణేష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహ రవి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

కోట, జనవరి 22: మండల పరిధిలోని గోవిందపల్లిలో పేదల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను ఓ భూస్వామి కబ్జాచేసి బోగస్ పట్టాలను సృష్టించి ఇబ్బందులు పెడుతున్నారని, అతనిపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ ఆ గ్రామ దళితులు సోమవారం తహసీల్దారు పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కొత్తపట్నం రెవెన్యూ సర్వే నెంబరు 635లో 6.7 ఎకరాల ప్రభుత్వ భూమిని గోవిందపల్లి దళితులు తరతరాల నుంచి సాగు చేసుకొంటున్నారని తెలిపారు. అయితే మిట్టపాళెం గ్రామానికి చెందిన ఓ భూస్వామి సదురు భూమిలో కొంతభాగాన్ని కబ్జాచేసి భోగస్ పట్టాలు సృష్టించి దళితులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. అతని ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమికి మోక్షం కల్పించాలంటూ తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు.

20 బాటిళ్ల మద్యం పట్టివేత

తడ, జనవరి 22: మండలంలోని అక్కంపేటలో నివాసం ఉంటున్న మణికంఠన్ ఇంటి పరిసరాల్లో దాచిన 20 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేశారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

నాయుడుపేట టౌన్, జనవరి 22: నాయుడుపేట - బిరదవాడ జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం మండలంలోని బిరదవాడ గ్రామానికి చెందిన వెంకటరమణయ్య మోటారు సైకిల్‌పై నాయుడుపేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆక్వా రైతులను ఆదుకోండి

కోట, జనవరి 22: కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టి రొయ్యలసాగు చేస్తే ప్రకృతి కన్నెర్ర చేయడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల రొయ్య రైతులు తహసీల్దారు పద్మావతికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రొయ్యల సాగు చేపడితే మిచౌంగ్ తుఫాన్ కారణంగా సర్వం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు పద్మావతికి అందజేశారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో బంగారు పతకం

నాయుడుపేట, జనవరి 22: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో నాయుడుపేటకు చెందిన లోకేష్ బంగారు పతకాన్ని సాధించాడు. కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈనెల 20, 21 తేదీల్లో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు జరిగాయి. ఇందులో లోకేష్ బంగారు పతకాన్ని సాధించాడు. ఇతనిని రెజ్లింగ్ యూనియన్ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సుదీప్‌రెడ్డి అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, జనవరి 22: నాయుడుపేట రాజగోపాలపురం వద్ద రహంతుల్లా(40) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సూళ్లూరుపేట పట్టణానికి చెందిన రహంతుల్లా కొంత కాలంగా నాయుడుపేట పట్టణంలో చికెన్ దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి రాజగోపాలపురంలో దుకాణాల వద్ద నిద్రించాడు. సోమవారం ఉదయం మృతి చెందినట్లు గుర్తించిన స్థానికుల పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

బాలాయపల్లి, జనవరి 22: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని సంగవరం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తడ పట్టణం సునీత నగర్‌కు చెందిన ధనశేఖర్(40) ఆదివారం ఉదయం బేల్దారి పని కోసం వెంకటగిరికి వెళ్లాడు. రాత్రి తిరిగి వెళుతుండగా నాయుడుపేట - వెంకటగిరి మార్గంలోని సంగవరం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

నాయుడుపేట టౌన్, జనవరి 22: నాయుడుపేట - మేనకూరు సమీపంలో ఆటో బోల్తా పడిన సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. సోమవారం నాయుడుపేట నుంచి మనవాలికి వెళ్తున్న ఆటో మార్గమధ్యలో మేనకూరు సమీపంలో ప్రమాదానికి గురైంది. డ్రైవర్ శ్రీనివాసులుతో విజయమ్మ, నోబి, సుశీలమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరినీ కలుపుకొని పోతా: సంజీవయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట, జనవరి 22: వైసీపీలోని ప్రతి నాయకుడినీ, కార్యకర్తనూ, అభిమానులను కలుపుకొని పనిచేస్తానని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చెప్పారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీలో ఎవరితోనూ తనకు ఎటువంటి భేషజాలు లేవని, తెలియక ఏదైనా తప్పుచేస్తే మన్నించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధనరెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, చంద్రారెడ్డి, కటకం జయరామ్, దారా రవి, అశోక్, రత్నశ్రీ, చెంగయ్య తదితరులు ఉన్నారు.

వరిలో దోమపోటు పట్ల జాగ్రత్తగా ఉండాలి

సూళ్లూరుపేట, జనవరి 22: తీవ్ర మంచు, పొడి వాతావరణ పరిస్థితులతో వరి పంటకు దోమపోటు, మెడ విరుపు తెగుళ్ల సోకే ప్రమాదం అధికంగా కనిపిస్తోందని ఏవో కవిత అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని కోటపోలూరు, ఆబాక, మన్నెముత్తేరి, ఇలుపూరు గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. బీపీటి 5204 రకం (పెద్ద జిలకర) ఎక్కువగా సాగుచేస్తున్నారని, తీవ్ర మంచు, పొడి వాతావరణం వల్ల దోమపోటు, ఎన్ను దశలో ఉన్న పంటకు మెడవిరుపు తెగుళ్ల సోకి అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి ట్రై సైక్లోజోల్, అజాక్సీ స్ట్రోబిన్ వంటి మందులను ఎకరాకు 200 ఎంఎల్ మోతాదులో పిచికారీ చేయాలని సూచించారు. పొలంలో నీటిశాతం అధికంగా ఉండేలా జాగ్రత్తలు తీసువాలన్నారు.

దుస్తులకు పంపిణీ

గూడూరు, జనవరి 22: స్థానిక సంగం థియేటర్ సెంటర్ వద్ద సోమవారం హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కంకణాల పెంచలనాయుడు పాల్గొన్నారు.